


# విజయభాను



## భూరికార్డులు రీ సర్వే చేయాలి




- ఏ భూమి ఎవరి పేరు మీదున్నదో తేల్చాలి
- భూముల సరిహద్దులకు రాళ్లు పాతాలి
- ప్రక్షాళన చేసి కొత్త పాస్ పుస్తకాలివ్వాలి
- ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఆదేశం

హైదరాబాద్ : రాష్ట్రంలోని 2.70 కోట్ల ఎకరాల భూమిని మొత్తం తిరిగి సర్వే చేసి ఏ భూమి ఎవరిపేరు మీద ఉందో నిగ్గు తేల్చాలని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు అధికారులను ఆదేశించారు. ఇందుకోసం రాష్ట్రమంతా స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని చెప్పారు. గ్రామాన్ని యూనిట్‌గా తీసుకొని ఆ గ్రామస్థుల సహకారంతో సర్వే జరిపి.. వారి సమక్షంలోనే భూముల రికార్డులు సరిచేయాలని నిర్దేశించారు. ప్రతి భూమికి ఒక ప్రత్యేక నంబర్ కేటాయించి కొత్త పాస్‌పుస్తకాలు మంజూరు చేయాలని అన్నారు. రాష్ట్రంలోని రెవెన్యూ అధికారులంతా ఇదే కార్యక్రమంలో నిమగ్నం కావాలని, ఒక్కో అధికారి మూడేసి గ్రామాల బాధ్యత తీసుకొని ఒక్కో గ్రామంలో 15 రోజుల వ్యవధిలో రికార్డులు సరిచేయాలని చెప్పారు. భూమి రికార్డుల ప్రక్షాళనకు అనుసరించాల్సిన వ్యూహం ఖరారు చేయడానికి ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్ ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఏడు గంటల పాటు జరిగిన సుదీర్ఘ సమీక్షలో సీఎం పలు కీలక నిర?యాలు తీసుకున్నారు. నిజాం కాలంలో 1936లో చేసిన బందోబస్తు తప్ప మళ్లీ భూమి రికార్డుల ప్రక్షాళన కార్యక్రమం జరుగలేదని, దీని వల్ల తరువాయి 2లో


## 500 నోటుపై పెద్ద దుమారం

- కాంగ్రెస్ నేత కపిల్ సిబల్ ఆరోపణ
- ఈ నోట్లు ఎక్కడి నుంచి వచ్చాయి?
- కేంద్ర మంత్రి నఖ్వి నిలదీత
- సైజు మార్పు సాధారణమే
- ప్రభుత్వం ఆదేశించలేదు
- ఆర్థిక శాఖ స్పష్టీకరణ



న్యూఢిల్లీ: ఆర్బీఐ కొత్తగా ప్రవేశపెట్టిన రూ.500 నోటు రాజ్య సభలో పెద్ద దుమారమే రేపింది. ఈ నోటు శతాబ్దంలో పెద్ద స్కామ్ అని కాంగ్రెస్ ఆరోపించింది. వేర్వేరు సైజులు, డిజైన్లు ఉన్న రెండు నోట్లను కాంగ్రెస్ నేత కపిల్ సిబల్ సభలో చూపించారు. మేం కూడా పాలించాం.. గానీ ఇలా ఒకటి ప్రభుత్వం కోసం, ఒకటి పార్టీ కోసం రెండు రకాలు నోట్లను ఎప్పుడూ ముద్రించలేదు. 500, 2000 నోట్లు రెండూ రెండు రకాలుగా ఉన్నాయి అని గులామ్ నబీ ఆజాద్ ఆరోపించారు. అయితే జీరో హవర్‌లో ఎన్నో ముఖ్యమైన అంశాలపై చర్చించాల్సి ఉన్నా.. కాంగ్రెస్ మాత్రం కరెన్సీ నోట్లపై బాధ్యతారాహిత్య ప్రకటన చేస్తున్నదని ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ విమర్శించారు. దీంతో కాంగ్రెస్ నేతలంతా సభలో ఆందోళన చేశారు. ఈ తరువాయి 2లో

## నంద్యాల ఉపఎన్నికల యుద్ధం



జగన్ ఉన్మాదికాక మరేమిటి?

రెచ్చగొట్టే వ్యాఖ్యలకు స్పందించవద్దు

వైకాపా నేతల వ్యాఖ్యలే వారిని ఓడిస్తాయి

తెదేపా కార్యకర్తలు సంయమనం పాటించాలి

ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు

అమరావతి: నంద్యాల ఉప ఎన్నికల్లో తెదేపా విజయం తథ్యమని ఏపీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు ధీమా వ్యక్తం చేశారు. తెలుగుదేశం పార్టీ నేతలతో తరువాయి 2లో

చంద్రబాబు అవహేళన చేశారు

ఓడిపోతామనే భయంతోనే విమర్శలు

ఇప్పుడు అభివృద్ధి పేరుతో రాజకీయం

అభివృద్ధి అడిగితే నిధులు లేవంటున్నారు

వైకాపా అధికార ప్రతినిధి అంబటి రాంబాబు

నంద్యాల: ఉప ఎన్నికలో ఓడిపోతామనే భయంతోనే సీఎం చంద్రబాబు అభివృద్ధి మంత్రం జపిస్తున్నారని వైఎస్సార్ సీపీ అధికార ప్రతినిధి అంబటి రాంబాబు విమర్శించారు. మంగళవారం ఆయన తరువాయి 2లో




### గుజరాత్ ఎన్నికలకు
## ముగిసిన పోలింగ్

అహ్మదాబాద్: గుజరాత్‌లోని మూడు రాజ్యసభ స్థానాలకు మంగళవారం నిర్వహించిన పోలింగ్ మధ్యాహ్నం రెండు గంటలకు ముగిసింది. గుజరాత్ అసెంబ్లీలో మొత్తం 182 మంది సభ్యులుండగా.. 176 మంది ఎమ్మెల్యేలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు ఆ రాష్ట్ర చీఫ్ ఎన్నికల అధికారి బీబీ.సావిన్ తెలిపారు. మూడు స్థానాలకు జరుగుతున్న ఈ ఎన్నికల్లో భాజపా నుంచి ముగ్గురు, కాంగ్రెస్ నుంచి ఒకరు బరిలో నిలిచారు.

ఈ ఎన్నికల్లో భాజపా జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా, కేంద్ర మంత్రి స్మృతి ఇరానీల విజయం ఖాయమైనట్టే. ఇటీవల కాంగ్రెస్‌ను వీడి భాజపాలో చేరిన బల్వంత్ సిన్హా రాజ్‌పుత్, కాంగ్రెస్ అభ్యర్థి అహ్మద్ పటేల్‌కు మధ్య పోరు ఆసక్తికరంగా మారింది. విజయం సాధించాలంటే ఒక్కో అభ్యర్థికి 45 ఓట్లు అవసరం కానున్నాయి.

రాజ్యసభ ఎన్నికల్లో తప్పకుండా విజయం సాధిస్తానని కాంగ్రెస్ అభ్యర్థి అహ్మద్ పటేల్ నమ్మకం వెలిబుచ్చారు. సంఖ్యాబలం తనకే ఎక్కువగా ఉందని.. ఫలితాలు అనుకూలంగా వస్తాయని విశ్వాసం వ్యక్తం చేశారు.


## రాహుల్‌పై రాళ్లదాడికి కారణం అదే..



న్యూఢిల్లీ: కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రాహుల్ గాంధీ కాన్వాయ్‌పై గుజరాత్‌లో జరిగిన రాళ్లదాడిపై కాంగ్రెస్ ఎంపీలు లోక్‌సభలో తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. కావాలనే ఆయనను లక్ష్యంగా చేసుకుని దాడికి పాల్పడ్డారంటూ విమర్శించడంతో... కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పందించారు. సెక్యూరిటీ ప్రోటోకాల్స్ వదలిపెట్టి వ్యక్తిగత కార్యదర్శిని అనుసరించడం వల్లే ఈ ఘటన జరిగినట్టు పేర్కొన్నారు. భద్రతా లోపాల కారణంగా రాళ్లదాడి జరిగిందన్న కాంగ్రెస్ విమర్శలను లోక్‌సభ వేదికగా తరువాయి 2లో

### ప్రభుత్వ పథకాలపై పన్ను
## ఆమోదయోగ్యం కాదు

ఆర్థిక మంత్రి ఈటెల



నిజామాబాద్: శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పునర్జీవ సభ ఏర్పాట్లపై ఆర్థిక మంత్రి ఈటెల సమీక్ష సమావేశం నిర్వహించారు. సభకు భారీ ఎత్తున రైతులు స్వచ్ఛందంగా తరలి వస్తున్నారని మంత్రి తెలిపారు. ఎవరికీ అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు.

అనంతరం మంత్రి జీఎస్టీపై వివరించారు. జీఎస్టీ విధివిధానాలను కౌన్సిల్ రూపొందించింది. జీఎస్టీతో రాష్ట్రాలపై అదనపు భారం పడకుండా చూడాలి. జీఎస్టీకి మద్దతు తెలిపి అసెంబ్లీలో బిల్లు పాస్ చేసినం. జీఎస్టీలో కొన్ని వస్తువులపై అధిక పన్నులు విధించడంతో అభివృద్ధి, సంక్షేమ తరువాయి 2లో

## అయోధ్య కేసులో గొప్ప మలుపు

యోగా తప్పనిసరి పిటిషన్ కొట్టివేత



న్యూఢిల్లీ : అయోధ్య రామ జన్మభూమి కేసుపై సుప్రీంకోర్టు త్వరలో విచారణ జరపబోతోంది. ఈ నేపథ్యంలో షియా, సున్నీ వక్ఫ్ బోర్డుల మధ్య విభేదాలు వచ్చినట్లు సమాచారం. తరువాయి 2లో




### టేకిట్ ఈజీ



అయ్యాగారి బట్టల మచ్చలు, మరకలు పోగొట్టడం నా వల్ల కాదు... చిన్న చిన్న స్కాములు చెయ్యమని చెప్పండి అమ్మగారు !!

## తల్లిపాలతో బిడ్డకు రోగ నిరోధక శక్తి

సదస్సులో శిశు సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జగదీశ్వర్



హైదరాబాద్: తల్లి పాలలో ఎన్నో పోషక విలువలు ఉన్నాయని, పిల్లల్లో రోగనిరోధక శక్తి పెంచటానికి ఇవి దోహద పడతాయని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎం.జగదీశ్వర్ తెలిపారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు పురస్కరించుకొని వెంగళరావునగర్ ప్రధాన రహదారిలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కార్యాలయంలో శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఒక్కరోజు బ్రెస్ట్ ఫీడింగ్ అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన శిశుసంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జగదీశ్వర్ మాట్లాడుతూ.. చాలా మంది తల్లులు పుట్టిన బిడ్డకు రెండు రోజుల వరకు పాలు ఇవ్వటం లేదని.. పుట్టిన రోజు నుంచి ఆరునెలల వరకు తల్లిపాలు పడితే తల్లీబిడ్డలకు ఎంతో ఆరోగ్యకరమన్నారు. పుట్టిన బిడ్డకు తల్లిపాలు ఇవ్వటం వల్ల తల్లులకు బ్రెస్ట్ క్యాన్సర్ రాకుండా ఉంటుందన్నారు. పుట్టిన బిడ్డకు తరువాయి 2లో

# మట్టిమూర్తులకు చక్కని రూపాలు



బెంగళూరు : గౌరీ-గణేష పండుగకు బెంగళూరు ప్యాటరీ టౌన్‌లో విగ్రహాల తయారీ వూపందుకుంది. కుండలు, మట్టి ముంతలు, పాత్రలు తయారు చేసే కుటుంబాలు ఇక్కడ లెక్కకు మించి ఉన్నాయి. శ్రావణ మాసం ప్రారంభమైనప్పటి నుంచి ఇతర ఉత్పత్తుల తయారీని నిలిపి వేసే ఈ కళా కార్మికులు ఆరు అంగుళాల నుంచి అడుగు ఎత్తు ఉండే విగ్రహాల తయారీని ప్రారంభిస్తారు.

రసాయనిక వర్ణాలు, ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ చేసే చెరుపును ద ృష్టిలో ఉంచుకుని గత కొన్ని సంవత్సరాలుగా తాము బంకమన్నుతోనే విగ్రహాలను తయారు చేస్తున్నామని పాటరీ టౌన్‌కు చెందిన రాఘవేంద్ర, లీల దంపతులు తెలిపారు. పండుగ ప్రారం భమయ్యేందుకు వారం ముందు నుంచి వ్యాపారులు టోకున విగ్రహాలను కొనుగోలు చేసుకుని తీసుకువెళతారని చెప్పారు. ఇప్పటికే వచ్చిన ఆర్డర్లకు తగిన విధంగా చుట్టుపక్కల ఉన్న సహ కార్మికుల సహకారంతో విగ్రహాల తయారీ, నగిషీలు దిద్దటం చేస్తుంటామని తెలిపారు. ఏ పండుగ చేసుకున్నా, చేసుకోపోయినా వినాయకచవితిని ప్రజలంతా తమ శక్తికొద్దీ నిర్వహించుకుంటారని, అదే ధైర్యంతో ఈమారు ఎక్కువ మొత్తంలో విగ్రహాల తయారీను చేపట్టామని వివరించారు.

### బోల్‌భం భక్తులతో

## శైవక్షేత్రాలు కళకళ

గోపాలపూర్ : గోపాలపూర్ పట్టణ పరిధిలో శ్రావణ పౌర్ణమి, రక్షాబంధన్ వేడుకలు ఘనంగా ఏర్పాటయ్యాయి. అన్నాచెల్లెళ్ల అనురాగానికి ప్రతీకగా సోదరీమణులు సోదరులకు రాఖీలు కట్టి మిఠాయి తినిపించారు. స్థానిక సరస్వతీ విద్యామందిర్‌లో ఈ సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటైంది. ప్రధానోపాధ్యాయుడు ఛండీప్రసాద్ అధ్యక్షతన జరిగిన వేడుకల్లో సూర్య నారాయణ పట్నాయక్, బికారి సాహు, గండు చరణపాత్ర్, రమీల-అనితా, రఘునాథ్ తదితరులు పాల్గొని రక్షాబంధన్ పవిత్రత, విశిష్టత వివరించారు. తర్వాత బాలబాలికలు, ఉపాధ్యాయులు రాఖీలు కట్టుకుని మిఠాయి తినిపించుకున్నారు. పట్టణ ఆరెస్సెస్ శాఖ సభ్యులు ఉదయం సూర్యోపాసన చేశారు. తర్వాత నగర పరిక్రమణగా ఇంటింటికి వెళ్లి రక్షాబంధనం గావించారు. మరోవైపు నెలరోజుల శైవపూజా దీక్షలు చేపట్టిన బోల్‌భం భక్తులు శ్రావణ పౌర్ణమను పురస్కరించుకుని వ్రతాలకు పూర్ణాహు చేశారు. శైవక్షేత్రాల్లో సామూహిక అభిషేకాలు జరిగాయి. బలభద్రుని జన్మదినాన్ని పురస్కరించుకుని అన్నదాతలు ఆ స్వామి ఆయుధం నాగళ్లకు పూజలు చేశారు. పశువులకు స్నానాలు చేయించి నొసట పసుపు తిలకం దిద్ది కుడుములు తినిపించి జగన్నాథ సంస్కృతికి అద్దం పట్టారు.

### గోవులకు విషపూరిత ఇంజెక్షన్లు

## ఇవ్వరాదు : సమీర్ మహంతి



భువనేశ్వర్ : గోవుల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలు ఉపసంహరించాలని భాజపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సమీర్ మహంతి డిమాండు చేశారు. గోవులకు టీకాలు పేరిట విషపూరిత ఇంజెక్షన్లు ఇచ్చేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని, ఈ ఆదేశాలు నిలిపివేయాలన్నారు. భాజపా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గోవులకు ఇచ్చే ఇంజెక్షన్ల నమూనాలు ముందు ల్యాబ్‌లకు పంపించి, పరీక్షలు జరిపిన తర్వాత ఆవులకు ఇవ్వాలని సూచించారు. ఈ ఇంజెక్షన్లు విషపూరితమైనవన్న ఆరోపణలు వెలుగులోకి వచ్చాయని, పరీక్షలు నిర్వహించి ల్యాబ్ నివేదికను ప్రజలకు తెలపాలని కోరారు. ఒకవేళ ఇంజెక్షన్లు విషపూరితమైనవని నిర్ధారణ జరిగితే పశుసంవర్ధక శాఖ మంత్రి దామోదర్ రౌత్‌కు వ్యతిరేకంగా భాజపా ఆందోళనలు చేపడుతుందని హెచ్చరించారు.

## 'స్వాతంత్ర్య' విన్యాసాలు ప్రారంభం

బెంగళూరు : పంద్రాగస్టుకు మానెక్‌షా పరేడ్ మైదానంలో నిర్వహించే సాహస ప్రదర్శనల కోసం అభ్యాస ప్రక్రియలు ప్రారంభమయ్యాయి. సైనిక, రక్షకదళ సభ్యులు బుల్లెట్ వాహనాలతో (రాయల్ ఎన్‌ఫీల్డ్) నిర్వహించే సాహస కృత్యాల అభ్యాసాన్ని మైదానంలో సోమవారం నిర్వహించారు. రెండు రోజుల పాటు ఆయా ప్రదర్శనలకు సంబంధించిన అభ్యాసాన్ని పూర్తి చేసిన తరువాత సైనిక మైదానంలో కొనసాగించనున్నారు. న ృత్య, జానపద కళాప్రదర్శనలను నిర్వహించే విద్యార్థులు, కళాకారులకు ఆ తరువాత మైదానంలో ప్రదర్శనకు అవకాశం కల్పించనున్నారు. స్వాతంత్ర్య దినోత్సవానికి మూడు రోజుల ముందు వరకు వేర్వేరు ప్రదర్శనల అభ్యాసానికి అవకాశం కల్పిస్తామని పాలికె అధికారులు తెలిపారు. ఆ తరువాత మైదానాన్ని పూర్తిగా పోలీసులు, భద్రతా సిబ్బంది ఆధీనానికి అప్పగించనున్నారు.

## అడి కృత్తికకు ఆటోల రద్దు

తిరుత్తణి : ఆడి కృత్తిక సందర్భంగా ఈ నెల 14, 15, తేదీల్లో తిరుత్తణి పట్టణంలోకి ఆటోల ప్రవేశాన్ని రద్దు చేశామని ఇన్‌స్పెక్టర్ వినాయగం తెలిపారు. తిరుత్తణి కొండమీద సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో 13 నుంచి 17వ తేదీ వరకు ఆడి కృత్తిక ఉత్సవాలు జరగనున్న నేపథ్యంలో దేవస్థానం అధికారులు, పోలీసు, రెవెన్యూ, పురపాలక శాఖల ఆధ్వర్యంలో చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులు చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో తిరుత్తణి పట్టణంలో వాహన రద్దీని నియంత్రించడంలో భాగంగా ఆటో కార్మికులు, యాజమానులతో సమావేశమై చర్చించారు. 14, 15 తేదీలలో ఆటోలను పట్టణంలోకి అనుమతించేది లేదని స్పష్టం చేశారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసు కుంటామని హెచ్చరించారు. తర్వాత ఆయన విలేకరులతో మాట్లా డుతూ తిరుత్తణిలో ఆడి కృత్తిక సందర్భంగా రద్దీని నియంత్రిం చడానికి ఎస్పీ శిబి చక్రవర్తి ఆదేశాల మేరకు అన్ని చర్యలు చేపట్టా మన్నారు. పట్టణానికి బయటే ప్రభుత్వ, ప్రైయివేటు తాత్కాలిక బస్టాండులు, కారు, ఇతర వాహనా పార్కింగ్ స్థలాలు సిద్ధం చేశా మన్నారు. ఈ సమావేశంలో సబ్ ఇన్‌స్పెక్టర్ సురేంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

## పుష్కరాలకు కమ్మవారి సంఘం ఏర్పాట్లు

శ్రీరామనగర్: అఖిల కర్ణాటక కమ్మవారి సంఘం మొదటిసారి మండ్య జిల్లా శ్రీరంగ పట్నం వద్ద కావేరమ్మ పుష్కరాలకు ఏర్పాట్లు చేస్తోంది. సెప్టెంబరు 12 నుంచి కావేరి నదికి పుష్కరాలు జరగనున్నాయి. నిరుడు ఉత్తర కర్ణాటకలోని తింథిణి వంతెన వద్ద నిర్వహించిన కృష్ణా పుష్కరాల మాదిరిగా వీటి నిర్వహణకు సన్నాహాలు చేస్తోంది. భక్తులు స్నానాలు చేసేం దుకు ఘాట్ల ఏర్పాటు, ఇతర సౌకర్యాలు కల్పిం చాలని సంఘం అధ్యక్షుడు గారపాటి రామకృష్ణ ముఖ్యమంత్రి సిద్ధ రామయ్యకు లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు. మండ్య జిల్లా పంచాయతీ అధ్యక్షురాలు ప్రేమ కుమారిని కలిసి శ్రీరంగ పట్నం వద్ద భక్తులకు సౌకర్యాలు కల్పించాలని వినతిపత్రం సమర్పిం చినట్లు తెలిపారు. పుష్కరాలను ప్రారంభిం చడానికి రావాలని మైసూరులోని గణపతి సచ్చిదా నంద స్వామీజీని కలిసి అభ్యర్థిం చామన్నారు. అధిక సంఖ్యలో ప్రజలు తరలిరావాలంటూ కర పత్రాలు, ఆహ్వాన పత్రికలు ముద్రించి పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. పుష్కరాల సమయంలో 12 రోజుల పాటు వచ్చే భక్తులకు ఉదయం ఉప హారం, మధ్యాహ్నం భోజన సౌకర్యం కల్పిస్తు న్నామని గారపాటి రామకృష్ణ తెలిపారు.

# చేనేతల సంక్షేమానికి కృషి

### సహజసిద్ధ రంగుల కాటన్ చీరల ఉత్పత్తికి చర్యలు

చెన్నై : రాష్ట్రంలోని చేనేత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి పేర్కొన్నారు. చెన్నై కలైవాణర్ అరంగంలో జరిగిన 3వ జాతీయ చేనేత దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కో-ఆప్టెక్స్‌లో అహింస రకం పట్టు చీరలను ప్రవేశపెట్టనున్నట్లు ప్రకటించారు. అదేవిధంగా పలు జిల్లాల్లో సహజసిద్ధమైన రంగులు వేసిన కాటన్ చీరల ఉత్పత్తికి చర్యలు చేపడతామన్నారు. రాష్ట్రంలో సహకార సంఘాల ద్వారా 11 వేల మంది చేనేత కార్మికులకు, 54 వేల మరమగ్గాల కార్మికులకు ఉపాధి అవకాశాలు అందిస్తున్నామన్నారు. వచ్చే ఏడాది పొంగల్ పర్వదినానికి 3.36 కోట్ల మందికి ఉచిత ధోవతులు, చీరలు అందిస్తామన్నారు. ప్రభుత్వ పథకాలైన ఉచిత ధోవతి, చీరల అందజేత, ఉచిత యూనిఫారం, వృద్ధులు, పింఛను దారులకు ఉచిత ధోవతులు, చీరలు అందించే పథకాలను అమలుచేసే సంస్థగా కో-ఆప్టెక్స్ నిలిచిందన్నారు. చేనేత రంగానికి, నేత కార్మికుల అభివ ృద్ధికి పలు పథకాలు అమలు చేయడం ద్వారా 1,156 చేనేత కార్మిక సహకార సంఘాల్లో 964 సంఘాలు లాభాల్లో నడుస్తున్నాయని చెప్పారు. 2017- 18కి సంబంధించి చేనేత విక్రయాలకు అందించే రాయితీని రూ.100 కోట్లకు పెంచారని, దీనిద్వారా 867 నేత కార్మిక సహకార సంఘాలు లబ్ధిపొందాయని వివరించారు. కార్మికులతో అనుబంధ వృత్తుల వారికి 2004లో వైద్య బీమా పథకాన్ని అమలు చేశారని, ముద్ర పథకం ద్వారా ఇప్పటివరకు 18,340 మంది నేత కార్మికు లకు క్రెడిట్ కార్డులు ఇచ్చారని పేర్కొన్నారు. వినియోగదారుల ఆకాంక్ష మేరకు కో-ఆప్టెక్స్‌లో అహింస రకం పట్టు చీరలను ప్రవేశ పెట్ట నున్నారని, సహజసిద్ధ రంగులు వేసిన కాటన్ చీరలను దిండుకల్, కోయంబత్తూరులోని వదంబచేరి, తిరుచ్చిలోని మణమేడు ప్రాంతాల్లో ఉత్పత్తి చేయడానికి చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా 2017- 18లో రాష్ట్ర స్థాయిలో ఉత్తమ నేత కార్మికుడి అవార్డు, రూ.లక్ష నగదు బహుమతి, ప్రశంసాపత్రాన్ని తిరుభువనం పట్టు చేనేత కార్మిక సహకార సంఘం సభ్యుడు ఎం.ఆర్.రాజశేఖర్‌కు, ఉత్తమ డిజైన్, నాణ్యతతో కూడిన చేనేత రకాలు తయారుచేసినందుకు 60 మంది నేత కార్మికులకు రూ.6 లక్షల మేర అవార్డులు, ప్రశంస పత్రాలను ముఖ్యమంత్రి అందజేశారు.

## 'అభివృద్ధిని మరచిన కేంద్రం'

సిరివార : ఎన్నికలకు ముందు ఎన్నో హామీలు గుప్పించిన నరేంద్ర మోదీ, గెలిచాక అభివృద్ధిని పూర్తిగా విస్మరించారని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, ఉత్తర కర్ణాటక బాధ్యుడు సాకే శైలజానాథ్ ఆరోపించారు.పట్టణంలో నిర్వహించిన కాంగ్రెస్ కార్యకర్తలు, ప్రముఖుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రం ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరించటం లేద న్నారు. రాష్ట్రంలో తీవ్ర కరవు పరిస్థితులు నెల కొన్నా కేంద్రం నుంచి పైసా కూడా రాష్ట్రానికి సాయం అందటం లేదన్నారు. ఈ నెల 12న రాయచూరులో నిర్వహించే రాహుల్ గాంధీ సభలో రైతులు తమ ధ్వనిని గట్టిగా వినిపించాలని సూచించారు.

కేపీసీసీ ఉత్తర కర్ణాటక కాంగ్రెస్ కార్యాధ్యక్షుడు ఎస్.ఆర్. పాటిల్, కె.సి.కొండయ్య, ఎమ్మెల్సీ ఎన్.ఎస్. బోసురాజు, ఎమ్మెల్యే హంపయ్యానాయక్ జిల్లా కాంగ్రెస్ బాధ్యుడు అల్లమ ప్రభుపాటిల్, మాజీ ఎమ్మెల్యే రాయప్పనాయక్ మాట్లాడారు. వేదికపై జిల్లా, తాలూకా కాంగ్రెస్ వివిధ సమితుల అధ్యక్షులు, ఇతర పథాధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా సామూహిక యజ్ఞోపవీత ధారణ



చెన్నై : తిరువల్లిక్కేణిలోని ఆర్యవైశ్య అఫిషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (ఆవోపా) ఆధ్వర్యంలో సామూహిక యజ్ఞోపవీత ధారణ ఘనంగా జరిగింది. జార్జిటౌన్‌లోని శ్రీకన్యకాపరమేశ్వరి దేవస్థానం (ఎస్‌కేపీడీ)లో శ్రావణ పౌర్ణమి సందర్భంగా జరిగిన ఈ కార్యక్రమంలో గృహస్థులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఆలయ మహా మండపంలో బారులుదీరారు. ఆలయ ప్రధాన అర్చకులు భాస్కర పంతుల పర్యవేక్షణలో వేదపండితులు దేవరకొండ హరి ప్రసాదశర్మ యజ్ఞోపవీత ధారణను శాస్త్రోక్తంగా నిర్వహించారు. పితృదేవతలకు తర్పణం పెట్టారు.

ఆవోపా అధ్యక్షుడు పి.బద్రీనాథ్ వేద పండితులను సత్కరించారు. ఆరు దశాబ్దాలుగా శ్రావణ పౌర్ణమినాడు ఈ కార్యక్రమాన్ని ఎస్‌కేపీడీలో ఉచితంగా నిర్వహిస్తున్నామని కార్యదర్శి ఎ.సుధాకర్ తెలిపారు. ఉపాధ్యక్షులు టీజీ శ్రీనివాస్, పి.రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి

## రాహుల్‌పై రాళ్లదాడికి కారణం అదే..

తిప్పికొట్టారు. రాహుల్ గాంధీ పర్యటన నేపథ్యంలో భారీ భద్రతా ఏర్పాట్లు జరిగాయి. చాలామంది సెక్యూరిటీ సిబ్బంది ఆయన వెంట ఉన్నారు. పోలీసులు ఏర్పాటు చేసిన బుల్లెట్ ప్రూఫ్ వాహనాన్ని రాహుల్ తిరస్కరించారు. పదే పదే వాహనాలు మారుస్తూ వెళ్లారు. భద్రతా సిబ్బంది సూచనలు అనుసరించి ఉంటే ఇలా జరిగేదికాదు అని పేర్కొన్నారు.

ఆయనకు ఎస్పీజీ భద్రత ఉన్నప్పటికీ పక్కన బెట్టడానికి కారణమేంటని రాజ్‌నాథ్ సింగ్ నిలదీశారు. గత రెండేళ్లలో రాహుల్ గాంధీ 72 రోజుల పాటు ఆరుసార్లు విదేశీ యాత్రలకు వెళ్లారు. కాని ఎస్పీజీ సిబ్బందిని మాత్రం తీసుకెళ్లలేదు. ఆయన ఎక్కడికెళ్లారో మాకు తెలియాలి.. ఎస్పీజీ సిబ్బందిని ఎందుకు తిరస్కరిస్తున్నారో చెప్పాలి.. అని ప్రశ్నించారు. గుజరాత్ ప్రభుత్వం ఈ ఘటనపై వేగంగా స్పందించిందని... ఇప్పటికే ఓ వ్యక్తిని అరెస్టు చేసిందని ప్రశంసించారు.

కాగా కాంగ్రెస్ సీనియర్ నేత ఖర్గే మాట్లాడుతూ.. కాశ్మీర్‌లో భద్రతా దళాలపై రాళ్లు విసురుతున్నది తీవ్రవాదులేనని కేంద్ర చెబుతోందనీ... మరి గుజరాత్ ఏ తీవ్రవాదులు రాళ్లు విసురుతున్నారో చెప్పాలని ప్రశ్నించారు. మిగతా కాంగ్రెస్ ఎంపీలంతా ఆయనతో గొంతు కలపడం.. పెద్ద ఎత్తున నినాదాలు చేయడంతో లోక్‌సభను కొద్దిసేపు వాయిదా వేస్తున్నట్టు స్పీకర్ సుమిత్రా మహాజన్ పేర్కొన్నారు.

## అయోధ్య కేసులో గొప్ప మలుపు

షియా వక్ఫ్ బోర్డు రామాలయానికి మద్దతుగా నిలుస్తున్నట్లు తెలుస్తోంది. వివాదాస్పద స్థలంలో రామాలయాన్ని నిర్మించుకోవచ్చునని చెప్తున్నట్లు తెలుస్తోంది. మశీదును ముస్లింలు నివసించే ప్రాంతానికి తరలించాలని కోరుతున్నట్లు సమాచారం. ఈ నెల 11వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు సుప్రీంకోర్టు త్రిసభ్య ధర్మాసనం ఈ కేసుపై విచారణ జరుగుతుంది.

యోగా తప్పనిసరి పిటిషన్ కొట్టివేత

దేశంలోని పాఠశాలల్లో యోగా సాధనను తప్పనిసరి చేయాలంటూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. 1 నుంచి 8వ తరగతి విద్యార్థులు రోజు యోగా సాధన చేసేందుకు వీలుగా జాతీయ యోగా విధానాన్ని అమలుపరిచే దిశగా ఆదేశాలు జారీచేయాలంటూ దాఖలైన పిటిషన్‌ను జస్టిస్ ఎంబీ లోకూర్ నేతృత్వంలోని ధర్మాసనం కొట్టివేసింది. అలాంటి అంశాలపై కేంద్ర ప్రభుత్వమే నిర్ణయం తీసుకుంటుందని స్పష్టం చేసింది.

పాఠశాలల్లో ఏం బోధించాలో చెప్పడం మా పని కాదు. ఈ అంశంపై మేమెలా ఆదేశించగలం అంటూ పిటిషనర్‌ను ప్రశ్నించింది. పాఠశాలల్లో ఏం బోధించాలనే అంశం ప్రాథమిక హక్కు కాదని పేర్కొంది.

## చంద్రబాబు అవహేళన చేశారు

విలేకరులతో మాట్లాడుతూ... మూడేళ్ల పాలనలో చంద్రబాబు నంద్యాల ముఖం కూడా చూడలేదన్నారు. నంద్యాల అభివృద్ధిని కోరుకునేది శిల్పా మోహన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మాత్రమేనని పేర్కొన్నారు. రోడ్లు వెడల్పు చేయమని గతంలో శిల్పా మోహన్ రెడ్డి కోరితే నిధులు ఎక్కడున్నాయని చంద్రబాబు అవహేళన చేశారని గుర్తు చేశారు. దీనికి సంబంధించిన వీడియో క్లిప్పింగ్‌ను మీడియా ముందు ప్రదర్శించారు.

ఇప్పుడు ఉప ఎన్నిక రాగానే అభివృద్ధి పేరుతో చంద్రబాబు రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. నంద్యాలలో ఇన్నేళ్లు రోడ్డు విస్తరణ ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. చంద్రబాబుకు ఓటమి భయం పట్టుకుందని, అందుకే శిల్పా మోహన్‌రెడ్డిపై కుట్రలు చేశారని ఆరోపించారు. 2014లో శిల్పా మోహన్‌రెడ్డి నామినేషన్‌పై ఏ లాయర్ సంతకం చేశారో, ఇప్పుడు అదే న్యాయవాది సంతకం చేశారని వెల్లడించారు. గెలవమనే భయంతో నామినేషన్‌పై నానా యాగీ చేశారని విమర్శించారు. ఉప ఎన్నికలో ఓటు ద్వారా చంద్రబాబుకు తగిన గుణపాఠం చెప్పాలను నంద్యాల ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## జగన్ ఉన్మాదికాక మరేమిటి?

మంగళవారం ఆయన టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ప్రజలకు చేరువ చేసే బాధ్యత పార్టీ నేతలదేనని పేర్కొన్నారు. 2019 ఎన్నికలకు ప్రతి ఒక్కరూ ఇప్పట్నుంచే సమాయత్తం కావాలని సూచించారు. ప్రతిపక్ష నేతలు చేసే రెచ్చగొట్టే వ్యాఖ్యలకు కార్యకర్తలెవరూ స్పందించవద్దని.. వారి సంగతి ప్రజలే చూసుకుంటారన్నారు. జగన్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడే ఉన్మాదిలా ప్రవర్తిస్తుంటే.. అధికారంలోకి వస్తే ఎలా ఉంటాడో ప్రజలే బేరీజు వేసుకోవాలన్నారు. సీఎంను చెప్పుతో కొట్టాలి, నడిరోడ్డుపై కాల్చి చంపాలి, కలెక్టర్‌ను జైలుకు పంపిస్తా, పోలీస్ కమిషనర్ పింఛన్ ఆపేస్తా అంటూ వ్యాఖ్యలు చేయడం ఉన్మాదం కాక మరేమిటి? అని చంద్రబాబు ప్రశ్నించారు. జగన్ ఉన్మాది అనడానికి ఆయన వ్యాఖ్యలే నిదర్శనమన్నారు. 2019 ఎన్నికల్లో వైకాపా 30 సీట్ల కంటే ఎక్కువ గెలిచేది లేదని సర్వేలన్నీ చెబుతున్నాయని తెలిపారు. వైకాపా నేతల వ్యాఖ్యలే వారిని ఓడిస్తాయని.. తెదేపా కార్యకర్తలంతా సంయమనం పాటించాలని చంద్రబాబు సూచించారు.

## 500 నోటుపై పెద్ద దుమారం

సందర్భంగా కాంగ్రెస్ నేత కపిల్ సిబల్ మాట్లాడారు. ప్రభుత్వం ఎందుకు నోట్లను రద్దు చేసిందో ఇప్పుడు తెలిసింది. ఆర్బీఐ రెండు వేర్వేరు సైజులు, డిజైన్లలో ఆర్బీఐ నోట్లను ముద్రిస్తున్నది అని సిబల్ విమర్శించారు. త ృణమూల్ కాంగ్రెస్ నేత డెరెక్ ఓబ్రైన్ కూడా కాంగ్రెస్ లేవనెత్తిన అంశాన్ని సమర్థించారు. ఇది చాలా సీరియస్ అంశమని ఓబ్రైన్ అన్నారు. అయితే ఈ నోట్లు ఎక్కడి నుంచి వచ్చాయో చెప్పాలని కేంద్ర మంత్రి ముక్తార్ అబ్బాస్ నఖ్వి నిలదీశారు. అయితే నోట్లలో స్వల్ప డిజైన్, సైజు మార్పులు సాధారణమేనని, ప్రభుత్వం ఆదేశించలేదని ఆర్థిక శాఖ స్పష్టంచేసింది.

## భూరికార్డులు రీ సర్వే చేయాలి

అలాగే ప్రస్తుతం ఇస్తున్న పట్టాదార్ పాస్‌పుస్తకాలు, పహాణిలు గందరగోళంగా ఉన్నాయి. అన్ని కాలమ్స్ అవసరం లేదు. సరళంగా ఉండాలి. ఒకసారి ప్రక్షాళన జరిగిన తరువాత ఆ వివరాలన్నీ ఆన్‌లైన్‌లో పొందుపరచాలి. సర్వే పూర్తయిన తరువాత కొత్త పాస్‌పుస్తకాలు ఇవ్వాలి. ప్రతి భూమికి ప్రత్యేక నంబర్ కేటాయించాలి. అవసరమైతే భూములకు హద్దురాళ్లు కూడా పాతాలి. గ్రామస్థాయిలో నిర్వహించే రికార్డుల్లో ఉన్న వివరాలే సీసీఎల్‌ఏ దగ్గర కూడా ఉండాలి. ఎక్కడ ఏ మార్పు జరిగినా ఆన్‌లైన్‌లోనే అన్ని చోట్లా రికార్డులు మారిపోవాలి. బ్యాంకుల్లో వేసిన డబ్బులు ఏటీఎంలో తీసుకోగానే ఎలా మెసేజ్ వస్తుందో భూమి రికార్డుల నిర్వహణ కూడా అలా ఉండాలి. బ్యాంకులు అవలంబిస్తున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని దీనికి ఉపయోగించాలి అని ముఖ్యమంత్రి కేసీఆర్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన సలహాదారు రాజీవ్‌శర్మ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్, రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బీఆర్ మీనా, సీఎంవో ముఖ్యకార్యదర్శి నర్సింగ్‌రావు, అదనపు ముఖ్య కార్యదర్శి శాంతికుమారి, కార్యదర్శి స్మితాసబర్వాల్, ప్రత్యేక కార్యదర్శి భూపాల్‌రెడ్డి, ఐటీ, పరిశ్రమలశాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ల శాఖ కమిషనర్ నదీమ్ అహ్మద్, మీ-సేవ కమిషనర్ వెంకటేశ్వరరావు, ఐఏఎస్ అధికారిణి ప్రియదర్శిని, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ రఘునందన్‌రావు, జేసీ సుందర్ అబ్నర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలపై పన్ను ఆమోదయోగ్యం కాదు

పథకాలకు ఆటంకం ఏర్పడుతుంది. సామాన్యుడిపై భారం పడకుండా చూడాలని కేంద్రాన్ని కోరినా పట్టించుకోలేదు. రైతులు, పేదప్రజలు వాడే వస్తువులపై జీఎస్టీ వద్దని కేంద్రాన్ని కోరినం.

మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, ఇరిగేషన్ ప్రాజెక్టులపై 18శాతం పన్ను ఆమోదయోగ్యం కాదు. తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాల విషయంలో ఏనాడు రాజీ పడలేదు. కాంగ్రెస్, బీజేపీలు అర్థంలేని విమర్శలు చేస్తున్నాయి. జీఎస్టీ కౌన్సిల్ మీటింగ్‌కు మంత్రి కేటీఆర్ రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధిగా పాల్గొన్నారు. రాష్ట్రాల అభిప్రాయాలను కేంద్రం గౌరవించాలి. రాష్ట్రాల ప్రత్యేక పరిస్థితులను పరిగణలోకి తీసుకురావాలి. జీఎస్టీ ప్రతి సమావేశానికి తెలంగాణ ప్రభుత్వం హాజరైంది. స్టేట్ ఓన్ ట్యాక్స్, రెవెన్యూలో తెలంగాణ దేశంలోనే అగ్రగామిగా ఉంది. 33 అంశాల మీద అభ్యంతరాలను జీఎస్టీ మీటింగ్‌లో స్పష్టం చేసినం. అయినా కేంద్రం పట్టించుకోకపోతే పోరాటం చేసి తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలు కాపాడుకుంటామని తెలిపారు.

## తల్లిపాలతో బిడ్డకు రోగ నిరోధక శక్తి

రెండేళ్ల వరకు తల్లిపాలు పట్టవచ్చని చెప్పారు. ప్రపంచ వ్యాప్తంగా తల్లిపాలు ప్రాధాన్యతపై విస్తృతంగా ప్రచారం జరుగుతోందన్నారు. ప్రతి ఏటా ఆగస్టు నెల 1వ తేదీ నుంచి 7వ తేదీ వరకు వారం పాటు అన్ని ఆసుపత్రులు, అంగన్‌వాడీ కేంద్రాలు, తదితర ప్రాంతాల్లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించి బాలింతలు, గర్భిణులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. తల్లిపాలు పిల్లలకు పట్టడంద్వారా కలిగే ప్రయోజనాలపై నిలోఫర్ ఆసుపత్రి గైనిక్ నిపుణురాలు డాక్టర్ హిమబిందు సదస్సుకు వచ్చిన వారికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో శిశుసంక్షేమశాఖ డె%రెక్టర్ విజయేంద్ర బోయి, యునిసెఫ్ ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్ర ప్రతినిధులు మైథేల్ రస్‌డియా, డాక్టర్ క్యాతీ తివారీ, తెలంగాణ రాష్ట్ర ప్రొగ్రామ్స్ ఆఫీసర్ డాక్టర్ సుధీరా, సెంట్రల్ కోఆర్డినేటర్ కమిటీ సభ్యులు డాక్టర్ కేశవులు, శిశుసంక్షేమశాఖ జాయింట్ డె%రెక్టర్ కె.ఎస్.ఆర్.లక్ష్మి, ఆర్జేడీ లలిత, తెలంగాణ జిల్లాలకు చెందిన సీడీపీఓలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

# హైదరాబాద్ ప్రాంతీయ వార్తలు

## కార్మిక చట్టాల అమలుపై ఆదేశాలు

కొత్తగూడెం : సింగరేణిలో పలు కార్మికచట్టాల అమలుపై బీఎంఎస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వీటిని పరిశీలించాల్సిందిగా రీజినల్ లేబర్ కమిషనర్(కేంద్రం) డాక్టర్ ఓంకార్‌శర్మ హైదరాబాద్ లోని డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్‌ను ఆదేశించారు. గడిచిన నెల 24న బీఎంఎస్ కేంద్ర మంత్రి బండారు దత్తాత్రేయను కలిసి పలు విషయాలపై వినతి పత్రాన్ని అందించారు. ఈ నేపథ్యంలోనే డిప్యూటీ లేబర్ కమిషన్‌కు కేంద్ర రీజినల్ లేబర్ కమిషనర్ ఆదేశించినట్లు బీఎంఎస్ పేర్కొంది. కోలిండియాలో అమలవుతున్న అనేక అంశాలు సింగరేణిలో అమలుకావడం లేదని తెలిపింది. క్యాడర్ స్కీము, కార్మికులకు పెర్క్స్‌పై ఆదాయ పన్ను తిరిగి చెల్లింపు కోలిండియాలో లభిస్తుండగా సింగరేణిలో లభించడం లేదని బీఎంఎస్ పేర్కొంది. సింగరేణిలో మహిళలకు ప్రసూతి, శిశు సంరక్షణ సెలవులు ఇవ్వడంలేదని ఫిర్యాదు చేసింది. కేంద్రీయ విద్యాలయాలను కూడా ఏర్పాటుచేయాలని కోరినట్లు బీఎంఎస్ అధ్యక్షుడు చింతల సూర్యనారాయణ, జేబీసీసీఐ సభ్యుడు లట్టి జగన్మోహన్, బీఎంఎస్ ప్రధానకార్యదర్శి మాధవనాయక్ తెలిపారు.

## గోపల్‌దిన్నె జలాశయాన్ని సందర్శించిన దిల్లీ బృందం

### చేపల పెంపకంపై మత్స్యకారులతో చర్చ



వీపనగండ్ల : వనపర్తి జిల్లా వీపనగండ్ల మండలంలోని గోపల్‌దిన్నె జలాశయాన్ని దిల్లీ నుంచి భారత చేపల వ్యవసాయ కార్పొరేషన్ సంస్థ బృందం సభ్యులు సందర్శించారు. జలాశయంలో చేపల పెంపకం, వేట తదితర అంశాలపై స్థానిక మత్స్యకారులతో సుమారు గంటకుపైగా సమావేశమై సమగ్రంగా వివరాలను సేకరించారు. దిల్లీ నుంచి వచ్చిన బృందంలో డా.శిహప్ప, డా.బసవరాజ్, డా.డీ.ఎస్.కృష్ణారావు, జగద్దార్ ఉన్నారు. జలాశయంలో చేపల పెంపకం ఎలా చేస్తున్నారు.. చేప విత్తనాన్ని ఎక్కడి నుంచి తెస్తున్నారు.. మార్కెటింగ్ సదుపాయం, చేపల అమ్మకం తదితర విషయాలను అడిగి తెలుసుకొన్నారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న చేప పిల్లలు మీకు అందుతున్నాయా? అంటూ ఆరా తీశారు. వాటి అభివృద్ధికి అందిస్తున్న ఆహారం ఏమిటి? ఎలా సమకూరుస్తున్నారు? వేట కోసం శిక్షణ ఏమైన తీసుకొన్నారా? అంటూ వివరాలు సేకరించారు. విత్తన ఉత్పత్తిని మీరే స్వయంగా ఎందుకు చేసుకోలేకపోతున్నారని అడిగారు. మత్స్యకార్మిక సంఘం అధ్యక్షుడు సీహెచ్ వెంకటయ్య, కార్యదర్శి రామకృష్ణ, ప్రతినిదులు నర్సింహ, మశన్న, ఈదన్న, అనుకలి నర్సింహ తదితరులు వారికి సమాచారం అందించారు. మార్కెట్ సదుపాయం లేక చాలా ఇబ్బందికరంగా ఉందని, తమకు ప్రత్యేకంగా వాహనం ఇస్తే దళారులను ఆశ్రయించకుండా నేరుగా హైదరాబాద్‌కు తీసుకెళ్తామని చెప్పారు. జలాశయంలో వదిలిన చేప పిల్లలకు ఎలాంటి ఆహారం ఇవ్వడం లేదన్నారు. కొంత మేర మాత్రమే ప్రభుత్వం పిల్లలను సరఫరా చేస్తే.. తాము స్వయంగా మరికొంత తెచ్చుకొంటున్నట్లు వివరించారు. విత్తన ఉత్పత్తికి అవకాశం ఇస్తే ఏర్పాట్లు చేసుకొంటామన్నారు. వారివెంట స్థానిక మత్స్యశాఖ అధికారులు నవీన్, మహేశ్వర్‌రెడ్డి, వెంకటస్వామి పాల్గొన్నారు.

## అర్జీల పరిష్కారంలో జాప్యం వద్దు: జేసీ

ఖమ్మం: ప్రజావాణిలో అర్జీలు ఇచ్చే వారి సమస్యలను పరిష్కరించడంలో జాప్యం చేయవద్దని జిల్లా సంయుక్తపాలనాధికారి కె.కృష్ణారెడ్డి పేర్కొన్నారు. పాలనాప్రాంగణ సమావేశ మందిరంలో డయల్ యువర్ కలెక్టర్, ప్రజావాణి కార్యక్రమాలను నిర్వహించారు. డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమంలో ఇంద్రవెల్లి మండలం ఏమాయికుంటకు చెందిన రాజు తమ గ్రామంలో ప్రభుత్వ స్థలాలు ఆక్రమించుకొని నాలాలు కడుతున్నారని ఫిర్యాదు చేశారు. బేల మండలం సాంగిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి అదనంగా మరో ఏఎన్ఎంను నియమించాలని ఆ గ్రామానికి చెందిన రాజు విన్నవించారు. ఉట్నూరు మండలం హస్నాపూర్ వాసి కపిల్ తమప్రాంతంలో సార్వత్రిక పాఠశాల పదోతరగతి పరీక్షకేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. జిల్లాకేంద్రానికి వెళ్లి పరీక్ష రాయాల్సి వస్తోందని తెలిపారు. జైనథ్ మండలం కౌటకు చెందిన ఆశన్న తనకు వీఆర్వో పట్టాపాసుపుస్తకం ఇవ్వడం లేదని ఫిర్యాదు చేశారు. ఆయా సమస్యలు విన్న సంయుక్తపాలనాధికారి వాటిపరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో డీఆర్వో శంకర్, జడ్పీ సీఈవో జితేందర్‌రెడ్డి, ఐసీడీఎస్ పీడీ ఉమాదేవి, ఆర్డీఓ సూర్యనారాయణ, ఏడీటీడబ్లూఓ సంధ్యా, ఏఓ సంజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 10 నుంచి జాతీయ చదరంగం పోటీలు

ఖమ్మం : అంతర్జాతీయ రేటింగ్ స్థాయి మూడో జాతీయ చదరంగం పోటీలను ఈనెల 10 నుంచి 15 వరకు ఖమ్మంలోని కవితా మెమోరియల్ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు జాతీయ చదరంగ సమాఖ్య సభ్యుడు అనంచిన్ని వెంకటేశ్వరావు సోమవారం తెలిపారు. 1600 లోపు రేటింగ్ టోర్నీ కావడంతో దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు పాల్గొంటారని.. ఈ అవకాశాన్ని జిల్లా క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మహారాష్ట్రకు చెందిన న్యాయనిర్ణేత ప్రవీణ్ థాకరే బృందం టోర్నీని పర్యవేక్షిస్తుందని వెంకటేశ్వరావు వివరించారు.

### విద్యుత్తు వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక చైర్‌పర్సన్, సభ్యుల రాక

ఇంద్రవెల్లి: ఉట్నూర్ విద్యుత్తు సబ్‌డివిజన్ పరిధిలోని మండలాల్లో విద్యుత్తు సమస్యలను ఎదుర్కొంటున్న వినియోగదారుల సమస్యలను పరిష్కరించేందుకు ఇంద్రవెల్లి విద్యుత్తు ఉప కేంద్రంలో పరిష్కార వేదికను ఏర్పాటు చేసినట్లు ఏఈఈ జాదవ్ రోహిదాస్ తెలిపారు. ఉట్నూర్ డివిజన్ పరిధిలోని కొమరం భీం జిల్లాలోని జైనూర్, సిర్పూరు (యు), ఆదిలాబాద్ జిల్లాలోని ఇంద్రవెల్లి, ఉట్నూర్, నార్నూర్, గుడిహత్నూర్, సిరికొండ మండలాల పరిధిలోని గ్రామాల్లో విద్యుత్తు వినియోగించే వినియోగదారుల సమస్యలను చైర్ పర్సన్, సభ్యుల ముందు విన్నవించుకోవచ్చునని అన్నారు. ఈ పరిష్కార వేదికకు తెలంగాణ ఉత్తర విద్యుత్తు సంస్థ వినియోగదారుల చైర్‌పర్సన్ ఎంఏ షరీఫ్, సభ్యులు ఎస్.రామకృష్ణ, ఎల్.కృష్ణ, ఏ.రామన్నలు పాల్గొంటారని అయన తెలిపారు. ఆయనతో పాటు లైన్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్ పాల్గొననున్నారు.

## పవిత్రోత్సవాలకు వైభవంగా పూర్ణాహుతి పూజలు



భద్రాచలం : భద్రాచలం రామాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామి వారికి సుప్రభాతం నిర్వహించి ఆరాధన జరిపి నామార్చనలు చేశారు. పవిత్రోత్సవాల కారణంగా నిత్యకల్యాణంతో పాటు పవళింపు సేవలను జరపలేదు. ఈ ఉత్సవాలు ఈనెల 2న ప్రారంభమవ్వగా వీటికి పూర్ణాహుతి పూజలను వైభవంగా జరిపారు. యాగశాలలో సమిధలను సమర్పించి హోమం నిర్వహించి పూజలు జరపడంతో ఈ ప్రాంతం ఆధ్యాత్మిక వాతావరణంతో భక్తిభావాలను పెంచింది. ఈవో ప్రభాకర శ్రీనివాస్ ఏర్పాట్లను పర్యవేక్షిస్తుండగా స్థానాచార్యులు స్థలసాయి నేతృత్వంలో ప్రధానార్చకులు జగన్నాథాచార్యులు, సీతారామానుజాచార్యులు ఈ క్రతువును కమనీయంగా జరిపారు. హయగ్రీవ స్వామి జయంతిని పురస్కరించుకుని తిరుమంజనాన్ని కనుల పండువగా జరిపారు. చంద్రగ్రహణం సందర్భంగా మధ్యాహ్నం కల్లా పూజలను పూర్తి చేసి 12.20 గంటల సమయంలో ఆలయం తలుపులను మూశారు. ఆలయ శుద్ధి నిమిత్తం సంప్రోక్షణ చేస్తారు. స్వామివారికి సుప్రభాత సేవను నిర్వహించి ఉదయం 6.30 గంటల నుంచి భక్తులకు దర్శనాలు కల్పించనున్నారు. ఆంజనేయ స్వామివారికి ఏకాంతంగా అభిషేకం ఉంటుంది. ఆర్జిత అభిషేకం ఉండదన్నారు. ఈనెల 2 నుంచి ఆగిన పవళింపు సేవలు, 3 నుంచి ఆగిన నిత్య కల్యాణాలు నేటి నుంచి తిరిగి ప్రారంభమవుతాయని తెలిపారు. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకోవాలన్నారు. 11న మూడో శుక్రవారం సందర్భంగా సామూహిక లక్ష్మీ అష్టోత్తర శతనామార్చనలు ఉంటాయన్నారు.

## ప్రధాన అర్చకునిపై చర్యలు తీసుకోవాలి

### ఆలయ కార్యాలయం ముందు ధర్నా

బాసర: కాసుల కోసం ఆలయ ప్రతిష్ఠను ఫణంగా పెట్టిన బాసర సరస్వతీ ఆలయ ప్రధాన అర్చకుడు సంజీవ్‌కుమార్‌పై కఠినచర్యలు తీసుకోవాలని బాసర గ్రామస్థులు డిమాండ్ చేశారు. అమ్మవారి ఉత్సవమూర్తిని తీసుకెళ్లి నల్గొండ జిల్లాలో ప్రైవేట్‌గా అక్షరాభ్యాసాలు నిర్వహించిన వైనంపై స్పందించిన బాసర గ్రామస్థులు ఆలయ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు, రుత్వికునిపై కఠిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. తప్పు జరిగినట్టు స్పష్టంగా తేలినా చర్యలు తీసుకోవటంలో ఆలయాధికారులు పట్టనట్టు వ్యవహరించటం దోషులకు వత్తాసు పలికినట్టు ఉందని ఈవోతో వాగ్వాదానికి దిగారు. స్పందించిన ఈవో సుధాకర్‌రెడ్డి గ్రామస్థులతో మాట్లాడుతూ ఘటనపై విచారణ జరుపుతున్నామని, సమగ్ర నివేదికను దేవాదాయశాఖ కమిషనర్‌కు సమర్పించి క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని గ్రామస్థులకు హామీ ఇచ్చారు. అనంతరం గ్రామస్థులు మాట్లాడుతూ వరుసగా ఆలయంలో అపశ్రుతులు జరుగుతున్నా, ఆలయంలో అమ్మవారికి జరిగే సేవల్లో లోపాలున్నా బాధ్యులపై చర్యలు తీసుకోవటంలేదని అధికారుల తీరును విమర్శించారు. వంశపారంపర్య అర్చకత్వం ముసుగున ఆలయంలో జరుగుతున్న దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేశారు. రెండురోజుల వ్యవధి ఇస్తామని అర్చకులపై కఠినచర్యలు చేపట్టకపోతే ఆలయం ముందు నిరవధిక ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. ఆందోళన కార్యక్రమంలో బాసరకు చెందిన పలు పార్టీల నాయకులు, యువజనసంఘాల నాయకులు, మిషన్‌బాసర యువకులు పాల్గొన్నారు.

## గృహ రుణాలు మంజూరు చేయాలి

కొత్తగూడెం : ఉపాధ్యాయులు గృహాలను నిర్మించుకోడానికి గృహ రుణాలను మంజూరు చేయాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డి.వెంకటేశ్వర్లు(డీవీ) అన్నారు. కొత్తగూడెంలో జరిగిన సంఘ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతం కావడంతో ఉపాధ్యాయులు, ఉద్యోగులు గృహ నిర్మాణాలకు రుణాలు లభించక ఇబ్బందులు పడుతున్నారన్నారు. నిబంధనలను కొంతమేర సడలించి, అర్హులందరికీ ఇళ్ల నిర్మాణాలకు రుణాలు ఇప్పించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రవి ఆధ్వర్యంలో సంఘ మహిళా నాయకులు కలెక్టర్ రాజీవ్‌గాంధీ, సంయుక్త కలెక్టర్ రాంకిషన్, డీఆర్‌ఓ, ఆర్‌డీఓ, డీఈఓ, బ్యాంక్ నోడల్ అధికారులను కలిసి రాఖీలను కట్టిన అనంతరం సమస్యలపై వినతి పత్రం అందజేశారు. జిల్లా కన్వీనర్ కె.శ్రీనివాసరావు, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు పి.నర్సయ్య, ఆర్.అపర్ణ, శాంతకుమారి, కవిత, భారతి, మోతీలాల్, కిషన్, ప్రసాదరావు, మహాదేవన్, శ్రీరాములు, గుణిరాం, వెంకటనారాయణ, సాయిబాబా, వారణాసి వెంకటేశ్వర్లు, సురేష్, ప్రసాద్, లాలు, చంద్రశేఖర్, కర్ణ పాల్గొన్నారు.

### ఉర్దూ మాధ్యమం అభ్యర్థులకు ప్రత్యేక నియామకాలు చేపట్టాలి

సిద్దిపేట : ఉర్దూ మాధ్యమం ఉపాధ్యాయుల అభ్యర్థుల కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా నియామకాలు చేపట్టాలని ముస్లిం ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఫకృద్దీన్ అన్నారు. సిద్దిపేట ప్రెస్ క్లబ్‌లో వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ అనేక మార్లు ఉర్దూ మాధ్యమం అభ్యర్థుల కోసం ప్రత్యేక నియామకాలు చేపడతామని అసెంబ్లీలో హామీ ఇచ్చి ఇంతవరకు చేపట్టలేదన్నారు. ఉర్దూ పాఠశాలల రేషనలైజేషన్ ప్రక్రియ చేపట్టి విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను నియమించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఉర్దూ మాధ్యమం ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు ఎండీ జబీరుల్లా, ప్రతినిధులు అఫ్జల్, సుల్తానా, ఫిర్‌దౌస్, అర్షియా తదితరులు ఉన్నారు.

## అనుమతులున్న నర్సరీల్లోనే నారు కొనాలి

గద్వాల : అనుమతులు ఉన్న నర్సరీల్లోనే కూరగాయల నార్లను రైతులు కొనుగోలు చేయాలని జిల్లా ఉద్యానశాఖ అధికారి సోమిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. నర్సరీలను ఏర్పాటు చేయాలనుకునేవారు ముందుగా ఉద్యాన శాఖ అనుమతులు తీసుకొని, షెడ్‌నెడ్లలో నార్లను పెంచాలన్నారు. ఉద్యాన శాఖలో నమోదు కాని నర్సరీల్లో కూరగాయల నార్లను కొనుగోలు చేస్తే తర్వాత నష్టం వాటిల్లినా ఉద్యాన శాఖ నుంచి ఎలాంటి పూచీ ఉండదన్నారు. టమోటా, మిరప, వంగ, క్యాబేజీ, క్యాలీఫ్లవర్‌లతో పాటు పూల మొక్కలను సాగుచేసే రైతులు నార్ల కొనుగోలు జాగ్రతలు తీసుకోవాలని సూచించారు.

## చేపపిల్లల కోసం కాకినాడకు అధికారులు

మహబూబ్‌నగర్ : జిల్లా మత్స్యశాఖ అధికారులు చేప పిల్లల కొనుగోలుకు కాకినాడ వెళ్లారు. కాకినాడు దగ్గరలో ఉన్న పాలకోడేరులో చేపలను పరిశీలించారు. వివిధ చేపల రకాలను పరిశీలించారు. జిల్లా కొనుగోలు కమిటీ సభ్యులైన ఏడీ ఖదీర్ అహ్మద్, మత్స్య సహకార సంఘం ఛైర్మన్ సత్యనారాయణలు చేపల సైజును పరిశీలించారు. ఇప్పటికే జిల్లా కమిటీ ఈ ఏడాది మూడు కోట్ల 26 లక్షల చేపపిల్లల కొనుగోలుకు టెండర్లను నిర్వహించారు. ఇందుకు ప్రభుత్వం రూ.2.60 కోట్లను కేటాయించింది. ఈ టెండరును కాకినాడుకు చెందిన సూర్యప్రకాశ్ కంపెనీ చేజిక్కించుకుంది. అధికారులు కలెక్టర్ సూచనల ప్రకారం చేపపిల్లను పరిశీలించేందుకు అక్కడకు వెళ్లారు.

## మహిళా సాధికారత సాధించేందుకు కృషి

### రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి ఈటల రాజేందర్



దిలావర్‌పూర్ : ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో మహిళా సాధికారత కోసమే ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తుందని రాష్ట్ర ఆర్థిక, పౌరసరఫరాల శాఖ మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండల పరిషత్ ఆవరణంలో రూ.32 లక్షలతో నిర్మించిన స్త్రీ శక్తి సంఘ భవనాన్ని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. మూడో విడత హరితహారాన్ని పురస్కరించుకొని ఇదే ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో మంత్రి ఈటెల మాట్లాడుతూ మహిళలు స్వశక్తితో అన్నిరంగాల్లో రాణించాలని సూచించారు. ధాన్యం కొనుగోళ్ల విషయంలో ఐకేపి మహిళలే ఎంతో కీలకమని, వారి చొరవతోనే రాష్ట్రంలో ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోళ్ల ప్రక్రియ సజావుగా సాగిందన్నారు. ఏ కుటుంబంలోనైతే మహిళలు చదువుకొని, కుటుంబ భాద్యతలు నిర్వర్తిస్తారో వారింట్లో అభివృద్ధి కొనసాగుతుందన్నారు. అందుకే ప్రభుత్వం మహిళలకు పెద్దపీఠ వేస్తూ అన్ని పథకాల్లో వారికే ప్రాధాన్యత కల్పించిందని వివిధ పథకాలను వివరించారు. వ్యాపారస్థుల కంటే కూడ మహిళలపైనే బ్యాంకు అధికారులు పూర్తి విశ్వాసం కనిపిస్తారనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గ్రహించాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలోనే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అత్యంత వెనుకబడిన జిల్లా అని ఇక్కడి ప్రజలకు ప్రభుత్వం చేసే చట్టాలు, జీవోలతో సంబంధం లేకుండా ఈ ప్రాంత అభివృద్ధికి జిల్లా స్థాయి అధికారులు మానవీయ కోణంలో ఆలోచించి పనులు చేపట్టాలని సూచించారు.అలాగే కొత్త జిల్లాల అభివృద్ధిలో భాగంగా అధికారులంతా సమష్టిగా సమన్వయంతో ముందుకు సాగుతూ ప్రగతి సాధించేందుకు కృషి చేయాలన్నారు. అంతకుముందు మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి మాట్లాడుతూ నిర్మల్ జిల్లా ప్రాంతంలో బీడీ కార్మికులు ఎక్కువగా ఉన్నారని, వారి అభివృద్ధి కోసం ప్రభుత్వం ఎంతో కృషిచేస్తుందన్నారు.ఈ ప్రాంత రైతుల అభివృద్ధి కోసం కాళేశ్వరం ఎత్తిపోతల పథకం కింద 27 ప్యాకేజీలో భాగంగా పంట కాలువల నిర్మాణం చేపట్టిందన్నారు. ఎస్సారెస్పీ పునరుజ్జీవం పేరుతో ప్రాజెక్టు అభివృద్ధి పనులు ప్రారంభిచేందుకు ఈ నెల 10న ముఖ్యమంత్రి కేసీఆర్ నిజమాబాద్ జిల్లా పోచంపాడ్‌కు రానున్నరని ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

కార్యక్రమంలో జిల్లా పాలనాధికారి ఇలంబరిది, సంయుక్త పాలనాధికారి శివలింగయ్య, ఎంపీపీ పాల్దే లక్ష్మి, సర్పంచి అనిల్, నిర్మల్ మార్కెట్ కమిటీ అద్యక్షుడు దేవేందర్‌రెడ్డి, ఎఫ్ఎస్‌సీఎస్ అధ్యక్షుడు రాంకిషన్‌రెడ్డి, తెరాస రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణగౌడ్, డీఆర్డీవో వెంకటేశ్వర్లు, మండల ఉపాధ్యక్షుడు జీవన్‌రావు, దిలావర్‌పూర్, నర్సాపూర్(జి) మండలాల అధ్యక్షులు కోడే రాజేశ్వర్, రాజేశ్వర్‌రెడ్డి, ఆయా గ్రామాలకు చెందిన సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, మండల స్థాయి అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

## చేనేతల సంక్షేమానికి ప్రభుత్వం చేయూత



ఆదిలాబాద్ : ముఖ్యమంత్రి కేసీఆర్ ఉద్యమ నేతగా ఉన్నప్పుడే చేనేత కార్మికుల సమస్యలు గుర్తించారని.. తెలంగాణ ప్రభుత్వ హయాంలో వారి సంక్షేమానికి అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నారని మంత్రి జోగు రామన్న అన్నారు. తెరాస ప్రభుత్వం చేనేత కార్మికులను ఆదుకునేందుకు ముడిసరకులపై రాయితీతో పాటు రుణాలు అందిస్తూ ఆర్థిక చేయూత ఇస్తోందని తెలిపారు. జిల్లా పరిషత్తు సమావేశ మందిరంలో జాతీయ చేనేత దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మాట్లాడారు. గత ప్రభుత్వాల హయాంలో రైతుల ఆత్మహత్యల తర్వాత చేనేత కార్మికులవే జరిగేవని గుర్తుచేశారు. వారి సమస్యలు గుర్తించిన తెరాస ప్రభుత్వం రుణాలు మాఫీ చేసిందని చెప్పారు. చేనేత కార్మికులను ఆదుకునేందుకు ప్రభుత్వ పాఠశాలలు, వసతిగృహాల్లో పిల్లలకు చేనేత దుస్తులను సరఫరా చేస్తోందన్నారు. కాలుష్యాన్ని నియంత్రించడంతో పాటు వ్యాధులు రాకుండా చేయడంలో చేనేత వస్త్రాలు చాలా ఉపయోగపడు తాయని వివరించారు. చేనేత రంగానికి మళ్లీ పాత రోజులు వస్తాయని ఆకాంక్షించారు. చేనేథ కార్మికులను ఆదుకోవాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.1286కోట్లు కేటాయించిందని తెలిపారు. కులవృత్తులను ఆదుకునేందుకు వివిధ సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. బోథ్ ఎమ్మెల్యే రాఠోడ్ బాపురావు మాట్లాడుతూ చేనేత కార్మికులను ఆదుకునేందుకు మంత్రి కేటీఆర్ ప్రత్యేక దృష్టిసారించారని పేర్కొన్నారు.

జిల్లా పాలనాధికారి బుద్ధప్రకాష్ ఎం.జ్యోతి మాట్లాడుతూ చేనేత వస్త్రాల మార్కెటింగ్‌కు అవసరమైన సాయం అందిస్తామని హామినిచ్చారు. రానున్న రోజుల్లో ఈ పరిశ్రమకు మంచి రోజులు రానున్నాయని ఆకాంక్షించారు.

గాంధీపార్కు సమీపంలో ఉన్న కొండా లక్ష్మణ్‌బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చేనేత వస్త్రాలను వినియోగిస్తామని ప్రతిజ్ఞ చేయించి, పలువురు వృద్ధులను మంత్రి సన్మానించారు. సమావేశంలో రాష్ట్ర డైరీ సంస్థ అధ్యక్షుడు లోక భూమారెడ్డి, పురపాలక అధ్యక్షురాలు రంగినేని మనీష, జడ్పీటీసీ సభ్యుడు ఇజ్జగిరి అశోక్, మార్కెట్ కమిటీ అధ్యక్షుడు ఆరె రాజన్న, పురపాలక కమిషనర్ మారుతి ప్రసాద్, చేనేత అభివృద్ధి అధికారి రవీందర్, బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు ఈర్ల సత్యనారాయణ, తెరాస నేతలు బాలూరి గోవర్ధన్‌రెడ్డి, అడ్డిభోజారెడ్డి, పద్మశాలీ సంఘం నేతలు మంచికట్ల ఆశమ్మ, కాసర్ల శ్రీనివాస్, అధికారులు, చేనేత కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

విజయభాను

సంపాదకీయం

# సంకుచిత రాజకీయమొద్దు

ప్రజా ప్రయోజనాలు, దేశ ప్రయోజనాల విషయంలో సంకుచిత రాజకీయాలను పక్కన పెట్టి కేంద్ర రాష్ట్రాలు సమన్వయంతో పనిచేయాలనేది ముఖ్యమంత్రి కేసీఆర్ ఉన్నతమైన విధానం. కేంద్రం కూడా ఇదే స్ఫూర్తితో వ్యవహరించాలె. ఇప్పటికైనా మించి పోయింది లేదు. వచ్చే నెల తొమ్మిదవ తేదీన హైదరాబాద్‌లో జరిగే సమావేశంలోనైనా జీఎస్టీ కౌన్సిల్ విజ్ఞతతో వ్యవహరించి ఈ పన్ను భారాన్ని ఎత్తివేస్తుందని ఆశిద్దాం. దేశంలోనే అపూర్వమైన రీతిలో తెలంగాణ ప్రభుత్వం ప్రజలకు దీర్ఘకాలిక ప్రయోజనం చేకూ ర్చే అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టింది. ప్రజోపయోగమైన ఈ కార్యక్రమాలకు అండగా నిలిచి ప్రోత్సహించడం కేంద్ర ప్రభుత్వం బాధ్యత. కానీ ఆశ్చర్యకరమైన రీతిలో వీటిపై వస్తు సేవల పన్ను (జీఎస్టీ)ను పన్నెండు శాతం విధించి వ్యయభారాన్ని పెంచింది. కేంద్రం మొదట పద్దెనిమిది శాతం జీఎస్టీ విధించిందనే మాట వింటే ఇంకా ఆశ్చర్యం కలుగుతుంది. తెలంగాణ ప్రభు త్వం జీఎస్టీ విధింపు అన్యాయమని అంటే పన్నెండు శాతానికి తగ్గించింది. కానీ సమాజ రూపురేఖలను మార్చివేసే రీతిలో చేపట్టిన ఈ పథకాలపై అసలు పన్ను విధించడమేమిటనేది కేం ద్రాన్ని అడుగవలసిన ప్రశ్న. ప్రజోపయోగమైన పథకాలపై పన్నులు వేయడం తగదని తెలంగాణ ప్రభుత్వం మొదటి నుంచి కేంద్రానికి నచ్చచెప్పే ప్రయత్నం చేస్తున్నది. కేంద్రానికి విజ్ఞప్తు లు చేయడంతోపాటు జీఎస్టీ కౌన్సిల్‌లో కూడా ఈ అంశాన్ని లేవనెత్తింది. ఇటీవలే శనివారం ఢిల్లీలో జరిగిన జీఎస్టీ సమావేశంలో కూడా రాష్ట్రం తరపున హాజరైన మంత్రి కేటీఆర్ ప్రజోపయోగ నిర్మాణాలపై పన్ను ఉండకూడదని కోరారు. దీనికి ఇతర రాష్ట్రాల నుంచి కూడా మద్దతు లభించింది. బీజేపీ పాలిత రాష్ట్రాలు కూడా ఇదే మాట వినిపించాయి. నిజానికి ఇది ఒక్క రాష్ట్రం సమస్య కాదు. అన్ని రాష్ట్రాలు ఎదుర్కొనే సమస్య. తెలంగాణ వాదన విన్న తరువాత, అన్ని రాష్ట్రాల నుంచి వివరాలు తెప్పించుకున్న తరువాత నిర్ణయం తీసుకుందామని కేంద్ర ఆర్థి క మంత్రి జైట్లీ జీఎస్టీ మండలిలో బదులు ఇచ్చారు. జైట్లీ ఇచ్చిన జవాబు కూడా ఏ మాత్రం సమంజసంగా లేదు. ఆయా రాష్ట్రాలలో ప్రాజెక్టుల వివరాలు తెప్పించుకోవలసిన అవసరం ఏమున్నది? ఇది ఆర్థిక పరమైన అంశం కాదు, నైతికమైన సమస్య. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన వెంటనే రాష్ట్ర ప్రభుత్వం అసాధారణమైన రీతిలో ప్రజల సం క్షే మం కోసం, రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రశంసనీయమైన బృహత్కార్యాలను చేపట్టింది. ఏ ఆడబిడ్డ మంచి నీటి కోసం బిందె పట్టుకొని కడప దాడి బయటకు వెళ్ళే పరిస్థితి ఉండకూడదనే మహదాశయంతో ఇంటింటికీ నల్లా అందించే మిషన్ భగీరథ పథకాన్ని చేపట్టింది. ఈ విధంగా మంచి నీటి సౌక ర్యం కల్పిస్తే కానీ మళ్ళా ఓట్లు అడుగబోమనే హామీ ఇవ్వడం ద్వారా తన దృఢ నిశ్చయాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించారు. ఈ మొత్తం ప్రాజెక్టు వ్యయం 35 వేల కోట్ల రూపాయలు. దీని పై 4, 200 కోట్ల మేర జీఎస్టీ విధించడం న్యాయ మా? కోటి ఎకరాలకు నీరు అందించాలనే సత్సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం కాళేశ్వరం, పాలమూరు వంటి నీటి పారుదల ప్రాజెక్టులు చేపట్టింది. వీటికి తోడు ఊరూరికి తల్లివంటి చెరువుల పునరుద్ధరణ కార్యక్రమాన్ని మిషన్ కాకతీయ పేర ప్రారంభించింది. పేదలు ఆత్మగౌరవంతో నివసించడానికి తోడ్పడాలనే కృత నిశ్చయంతో రెండు పడక గదుల ఇండ్ల నిర్మాణం చేపట్టింది. రెప్పపాటు కూడా విద్యుత్ ప్రసారానికి అంతరాయం కలుగకూడదనే భావనతో యాదాద్రి, భద్రాద్రి విద్యుత్ కేం ద్రాల నిర్మాణం తలపెట్టింది. ఉన్నత జీవనం, సమగ్రాభివృద్ధికి జీవనాడులైన రహదారుల నిర్మాణాన్ని కూడా సకాలంలో పూర్తి చేయాలని భావిస్తున్నది. ఈ పథకాల వ్యయం అంతా కలిసి రెండు లక్షల కోట్లకు పై మాటే. సదుద్దేశంలో చేపట్టిన ఈ ప్రాజెక్టులకు వ్యయభారాన్ని తాము మోస్తామని ముందుకు రావలసింది పోయి పన్ను విధించడం ఏ మాత్రం సహేతుకం కాదు. బడ్జెట్‌లో కేటాయింపులు జరిపి, నిర్ణీత లక్ష్యం సాధించడానికి పరుగులు పెడుతున్న దశ లో కాళ్ళలో కట్టె పెట్టడం కేంద్ర ప్రభుత్వ ఔన్నత్యాన్ని ప్రశ్నార్థకం చేస్తున్నది. ప్రాజెక్టుల కాంట్రాక్టులన్నీ పునస్సమీక్షించుకోవలసి వస్తుంది. సీమాంధ్ర పాలనలో ప్రాజెక్టులను ఏండ్ల కొద్దీ సాగదీసేవారు. వందల కోట్ల ప్రాజెక్టులు వేల కోట్లకు చేరుకునేవి. ప్రజా సంక్షేమం కన్నా కాంట్రాక్టుల, దళారుల, నాయకుల లబ్ధి ప్రధానాంశంగా ఉండేది. కానీ తెలంగాణ ప్రభుత్వం పరిశ్రమల మాదిరిగా నీటి పారుదల ప్రాజెక్టుల నిర్మాణాన్ని కూడా మూడు షిఫ్టులలో కార్మికులను నియమించి వేగంగా నడిపిస్తున్నది. ఈ దశలో జీఎస్టీ భారం పేర అడ్డుపుల్లలు వేయడం తగదు.

# హెచ్-1బీ వీసాలతో ఏ దేశానికి లాభం?




హెచ్-1బీ వీసా ప్రొగ్రామ్.. గత కొంతకాలంగా ఇటు భారత్‌కు, అటు అమెరికాకు వివాస్పదమైంది. ఈ వర్క్‌వీసాలపై వస్తూ తమ ఉద్యోగాలను భారతీయులు కొల్లగడుతున్నారని అమెరికా వాదిస్తుండగా.. భారత్ ఈ విమర్శలను కొట్టిపారేస్తోంది. అసలు ఈ వీసా ప్రొగ్రామ్ వల్ల ఎవరికి ప్రయోజనం? ఎవరికి ఉండదు? అనుకుంటే. ఇరు దేశాలు ఈ వీసా ప్రొగ్రామ్ వల్ల లబ్ధి పొందుతున్నారని తాజా నివేదికల్లో వెల్లడైంది. ది యూనివర్సిటీ ఆఫ్ మిచిగాన్, సెంటర్ ఫర్ గ్లోబల్ డెవలప్‌మెంట్ రీసెర్చర్లు చేసిన తాజా అధ్యయనంలో ఈ విషయం తెలిసింది. అటు అమెరికా, ఇటు భారత్ ఇరు దేశాలకు హెచ్-1బీ వీసా ప్రొగ్రామ్ ఆర్థిక ప్రయోజాలను అందిస్తుందని చెప్పింది. అమెరికా వీసా ప్రొగ్రామ్ వల్ల ఇరు దేశాల ఆదాయాలు 17.3 బిలియన్ డాలర్లు పెరిగాయని, అంతేకాక అమెరికా, భారత్‌ల ఐటీ ఉత్పత్తి 2010లో 0.45 శాతం పెరిగిందని సెంటర్ ఫర్ గ్లోబల్ డెవలప్‌మెంట్ గౌరవ్ ఖన్నా, మిచిగాన్ యూనివర్సిటీ నికోలాస్ మోరాలెస్ పేర్కొన్నారు. అదేవిధంగా ఈ ప్రొగ్రామ్ వల్ల 2010లో అమెరికా ఉద్యోగుల సంపద 431 మిలియన్లకు పెరిగినట్టు కూడా తెలిపారు. ఇమ్మిగ్రేషన్‌తోనే ప్రతి దేశంలోని యావరేజ్ వర్కర్ ఎంతో ఉన్నతంగా తీర్చిదిద్దబడ్డారని అధ్యయనం తెలిపింది.

అమెరికా స్థానిక వర్కర్లకు హెచ్-1బీ వీసా ప్రొగ్రామ్ ఎక్కువ లబ్ధి చేకూరుస్తుందని ఖన్నా చెప్పారు. '' అమెరికా కలను సాధించే క్రమంలో ఐటీ బూమ్, ఇతర పర్యవసనాలు'' అనే టైటిల్‌తో ఈ అధ్యయన రిపోర్టును రూపొందించారు. హెచ్-1బీ వీసా ప్రొగ్రామ్‌పై లోతైన విశ్లేషణ, 2000 కాలం నుంచి అమెరికా, భారత ఆర్థిక వ్యవస్థలపై దీని ప్రభావం వంటి విషయాలపై అధ్యయనం చేశారు. ఈ ప్రొగ్రామ్ ద్వారా విదేశీయులకు అమెరికాలో ఉద్యోగం కల్పించడానికి కంపెనీలకు అనుమతి ఉంటుంది. దేశీయ ఐటీకి అతిపెద్ద మార్కెట్‌గా ఉన్న అమెరికాలో భారత కంపెనీలు టీసీఎస్, విప్రో, ఇన్ఫోసిస్‌లు హెచ్-1బీ వీసా ప్రొగ్రామ్‌ను వాడుతూ విదేశీయులకు ఉద్యోగాలు కల్పిస్తున్నాయి. ఈ ప్రొగ్రామ్ ద్వారా తక్కువ వేతనానికి భారతీయులను కంపెనీలు నియమించుకుంటూ...తమ ఉద్యోగాలకు గండికొడుతున్నాయని అమెరికా వాదిస్తోంది. హెచ్-1బీ వీసా ప్రొగ్రామ్‌పై అమెరికా కఠినతరమైన నిబంధనలు తీసుకొస్తోంది.

# ఉద్యోగాలు కోల్పోయిన పోలీస్ పర్వాతారోహకులు



పుణె: ఎవరెస్టు శిఖరం అధిరోహించామని తప్పుడు ప్రచారం చేసిన పుణె పోలీస్ దంపతులు ఉద్యోగాలు కోల్పోయారు. గతేడాది జూన్‌లో ఎవరెస్టు అధిరోహించామని దినేశ్ రాథోడ్, తారకేశ్వరీ రాథోడ్ పోలీస్ దంపతులు ప్రచారం చేసుకున్నారు. అయితే వీరు అసలు ఎవరెస్టే ఎక్కలేదు.. మార్ఫింగ్ ఫోటోలతో తప్పుడు ప్రచారం చేసి జనాలను, పుణె పోలీస్ శాఖను తప్పు దోవ పట్టించారు.

గతేడాది జూన్5 న ఎవరెస్టు అధిరోహించిన తొలి పోలీస్ దంపతులమని సోషల్ మీడియాలో ప్రచారం చేసుకున్నారు. ఇది చూసిన స్థానిక పర్వతారోహకులు ఈ దంపతులు ఎవరెస్టు ఎక్కలేదని, నేపాల్ ప్రభుత్వం గతేడాదే దంపతుల పర్వతారోహణాన్ని 10 ఏళ్ల వరకు నిషేదించిందని పుణె పోలీసులకు సమాచారం ఇచ్చారు. నేపాల్ ప్రభుత్వ నిషేదాన్ని నిర్ధారించుకున్న పుణె పోలీసులు విచారణ చేపట్టగా మార్ఫింగ్ పోటోలతో మోసం చేశారని వెల్లడైంది. వెంటనే శాఖపరమైన చర్యలు తీసుకుంటూ ఉద్యోగాల నుంచి తొలిగించారు.

# చిన్నారులకు ఆర్టీసీ రాయితీ

అమరావతి: సీనియర్ సిటిజన్లకు ఏసీతో సహా అన్ని బస్సు టిక్కెట్లపై రాయితీ ప్రకటించిన ఆర్టీసీ చిన్నారులకు కూడా రాయితీ ఇవ్వనున్నట్టు తెలిపింది. ఈ మేరకు ఆర్టీసీ ఈడీ జయరావు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఐదేళ్లలోపు చిన్నారులు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణం చేయవచ్చని, అలాగే 12 ఏళ్లలోపు పిల్లలకు ఏసీ బస్సు సర్వీసుల్లో 25 శాతం, సూపర్ లగ్జరీ, ఎక్స్‌ప్రెస్ సహా అన్ని బస్సుల్లో అయితే 50 శాతం రాయితీ ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు.

కాగా, ఈ రాయితీ పొందాలంటే వయస్సు ధ్రువీకరణ పత్రం చూపించాల్సి ఉంటుందని జయరావు స్పష్టం చేశారు.

# కాంగ్రెస్ అభ్యర్థి అహ్మద్ పటేల్ గెలుస్తారా !

అహ్మదాబాద్ : గుజరాత్‌లో రాజ్యసభ ఎన్నికల పోలింగ్ ఉత్కంఠ రేపుతోంది. మూడు స్థానాలకు జరుగుతోన్న ఈ ఎన్నికల్లో భాజపా నుంచి ముగ్గురు, కాంగ్రెస్ నుంచి ఒకరు బరిలో నిలిచారు. రాజ్యసభ ఎన్నికల్లో గెలిచేందుకు ఒక్కో అభ్యర్థికి 45 ఓట్లు అవసరం కానున్నాయి. భాజపాకు 121 మంది ఎమ్మెల్యేలు ఉండటంతో ఇప్పటికే అమిత్‌షా, స్మృతి ఇరానీల విజయం ఖాయమైనట్టే.

అయితే, ప్రస్తుతం బల్వంత్ సిన్హా రాజ్‌పుత్, కాంగ్రెస్ అభ్యర్థి అహ్మద్ పటేల్‌కు మధ్య పోరు రసవత్తరంగా మారింది.

మొత్తం 182 మంది సభ్యులున్న గుజరాత్ అసెంబ్లీలో భాజపాకు 121 మంది, కాంగ్రెస్‌కు ఇది వరకు 57 మంది ఎమ్మెల్యేలు ఉండేవారు. ఆరుగురు రాజీనామా చేయడం, వాఘేలాతో మరో ఏడుగురు విడిపోవడంతో ప్రస్తుతం 44 మందే మిగిలారు. కాంగ్రెస్ శిబిరంలో ఉన్న ఎమ్మెల్యేలు క్రాస్ ఓటింగ్‌కు పాల్పడినా, నోటా గుర్తుకు ఓటేసినా ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు నిరాశే ఎదురవుతుంది. భాజపా మూడో అభ్యర్థి బల్వంత్ సిన్హా రాజ్‌పుత్ గెలుపునకు ఇంకా 14 మంది సభ్యుల మద్దతు అవసరం. గుజరాత్ అసెంబ్లీలో ఇద్దరు సభ్యులు కల్గిన ఎన్సీపీ సైతం ఆఖరి నిమిషంలో భాజపాకు తన మద్దతు ప్రకటించడం కీలకంగా మారింది. అంతేకాకుండా ఇతరుల నుంచి కూడా తమకు ఓట్లుపడే అవకాశం ఉందని భాజపా ధీమా వ్యక్తంచేస్తోంది.

కవి సమయం

## "దప్పికి కరువు రోజులు పోవాలి"

పల్లవి : ఏదిరో దప్పికి కళ్ళు తిరిగిపోతుంటే?
పొద్దల్ల పాటులతో వేళ తిరిగిపోతుంటే?
కసింత దప్పిక్కి కడపార బెట్టాలా?
నిండార దప్పిక్కి నోరారగించాలా? "ఏదిరో"

చరణం : పుట్టిన పుడమినా - కలిమి యిదేనా?
కనిన తల్లి పుణ్యానికి న్యాయమిదేనా?
చూడంఁడ్రో పాలకులు మా వైపు
నడపంఁడ్రో ప్రజా పాలననిపిస్తు "ఏదిరో"

చరణం : స్వయం కృషి పాలన మనదన్నాం
కొనబోతె ధరలెంతో ఎగువన్నాం
ఏవేవి కొనగలరు పేదోళ్ళు
స్వరాజ్య మన్నది యిలగుంద; "ఏదిరో"

చరణం : కాసినోళ్ళు బిడ్డలతో పాపాల?
మురికి నీరు కొండల్లో జీవాల?
కనికారం లేనన్ని జబ్బులు
ధనముంటే ఔనన్న మందులు "ఏదిరో"

చరణం : సంపాదన యెంతుంటే సంతోషం?
నడపలేని పరిపాలన ఏమంటం;
సభలలో పలుకుబడి యెంతెంతో
తప్పట్లు కొట్టుటే ఆనందం "ఏదిరో"

:- దప్పికి కరువు రోజులు పోవాలి:-

...కవితా రచన
మజ్జి శ్యామసుందరరావు
సెల్ నెం: 9290839512

# పంచాంగం

మాసం : శ్రావణ ; విదియ రా.11.52;
శతభిషం పూర్తి మ.వ.12.42ల 2.21

బుధవారం
09-08-2017

**మేషం** : విద్యా విషయాల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తారు. అవివాహితులకు అనుకూలం. శస్త్ర చికిత్స సమయంలో వైద్యులకు ఏకాగ్రత అవసరం. చేతి వృత్తులు, చిరు వ్యాపారులు, చిన్న తరహా పరిశ్రమల వారికి ఆశాజనకం. ఉద్యోగులు అపరిచిత వ్యక్తుల పట్ల వ్యవహరించండి. కుటుంబీకులతో ఉత్సాహంగా గడుపుతారు. **వృషభం** : పిల్లల, ప్రియతముల విషయంలో అధికంగా ఖర్చు చేస్తారు. అనుకోని సంఘటనలు ఎదురవుతాయి. లీజు, ఏజెన్సీ, నూతన కాంట్రాక్టుల విషయంలో పునరాలోచన అవసరం. పెద్దల సానుభూతి లభిస్తుంది. కిరాణా, ఫ్యాన్సీ, గృహోపకరణ వ్యాపారులసు పురోభివృద్ధి. **మిథునం** : మీ మాటకు ఇంటా బయటా ఆదరణ లభిస్తుంది. నూతన వస్తు ప్రాప్తి. విదేశీ ప్రయత్నాలు ఫలిస్తాయి. పండ్ల, కూర, పానీయ వ్యాపారస్తులకు అనుకూలం. **కర్కాటకం** : స్త్రీలు భేషజాలు పోకుండా పరిస్థితులకు అనుగుణంగా మెలగవలసి ఉంటుంది. కార్య సాధనలో జయం పొందుతారు. నూతన వ్యాపారాలకు సంబంధించిన ఒక నిర్ణయానికి వస్తారు. భాగస్వామి విషయంలో ఆందోళన చెందుతారు. రావలసిన ధనం సకాలంలో మీ చేతికందును. **సింహం** : దూర ప్రయాణాల లక్ష్యం నెరవేరుతుంది. ఒక వ్యవహారం నిమిత్తం న్యాయవాదులను సంప్రదిస్తారు. మీ అంత రంగిక విషయాలు గోప్యంగా ఉంచండి. ఖర్చులు అధికమైనా ప్రయోజనపరంగా ఉంటుంది. **కన్య** : వ్యాపార రంగంలోని వారికి అభివృద్ధి కానవస్తుంది. ఆర్థిక లావాదేవీలకు అనుకూలం. ఆరోగ్య విషయంలో జాగ్రత్త పాటించండి. కుటంబ సభ్యుల ధోరణి మీకు ఎంతో చికాకు కలిగిస్తుంది. **తుల** : ఊహించని ఖర్చులు మీ అంచనాలు దాటిన మిత్రుల సహాయ సహకారముల వలన సమసిపోగలవు. ఉద్యోగస్థులకు పురోభివృద్ధి కాన వచ్చిన కొంత మంది మాట తీరు, కొన్ని వార్తలు మీకు ఆందోళన కలిగిస్తుంది. కొంత మంది మిమ్మల్ని ధన సహాయం అర్థిస్తారు. **వృశ్చికం** : విందులు, వినోదాల్లో పాల్గొంటారు. నూతన పరిచయాలు పెంచు కుంటారు. సాంఘిక, సాంస్కృతిక కార్యక్రమాల పట్ల ఏకాగ్రతతో వ్యవహరిస్తారు. నిరుద్యోగులకు అవకాశం లభించిన దాన్ని వినియోగించుకోలేరు. **ధనుస్సు** : వృత్తి, వ్యాపారానికి సంబంధించి ఓ సమాచారం కలవర పరుస్తుంది. సృజనాత్మకంగా ఆలోచిస్తారు. దూరంలో ఉన్న వ్యక్తులకు సంబంధించి కీలకమైన సమాచారం అందుకుంటారు. **మకరం** : కోర్టు వ్యవహారాలు వాయిదా పడుట మంచిది. మీ కళత్రం మొండి వైఖరి మీకు చికాకు కలిగిస్తుంది. మీ సంతానం ఆరోగ్యం, విద్యా విషయాల గురించి ఆలోచిస్తారు. వాహన యోగం పొందుతారు. **కుంభం** : ఏజెంట్లు, బ్రోకర్లు, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు శ్రమకు తగిన ఫలితం కానవస్తుంది. మీ అంతరంగిత సమస్యలకు పరిష్కార మార్గం కానరాగలదు. మీ అలవాట్లు, బలహీనతలు అదుపులో ఉంచుకోవడం మంచిది. **మీనం** : కొబ్బరి, పండ్ల, పానీయ వ్యాపారస్తులకు అనుకూలమైన కాలం. స్పెక్యులేషన్ కలసిరాగలదు. వృత్తులలోని వారికి, పౌరోహితులకు చికారు తప్పదు. పారిశ్రామిక రంగంలోని వారికి నూతన ఆలో చనలు స్ఫురిస్తాయి. ఇతరుల విషయాలలో జోక్యం చేసుకోకండి.

# రామాయణం: సీతాదేవి వ్యక్తిత్వం.. ప్రత్యేకత



సంకీర్తన

క్షమ..దయ...ధైర్యం...వివేకం...ఆత్మాభిమానం కలబోసిన ఉదాత్తమైన స్త్రీ పాత్ర సీత'. సతీ లేనిదే రామాయణం లేదు. సీత లేకుండా రాముని జీవితాన్ని అసలు ఊహించలేము. కాబట్టే రామాయణ ఇతిహాసంలో ఆమె పాత్రపై ఎందరో మహానుభావాలు మరియు మేథావులు పరిశోధనలు కూడా చేశారు. సీతలోని సుగుణాలు నేటి మగువలకు ఎంతో ఆదర్శం. ఆమె చరితం ఓ స్ఫూర్తిదాయకమైన కథాసాగరం. రామాయణంలో ఏ ఘట్టం తీసుకున్నా సీత గుణగుణాలు ప్రతి ఒక్కరికీ ఎంతో ఆదర్శప్రాయంగా నిలుస్తాయి... ధర్మమూర్తి: సీత ఒక ఇల్లాలిగా తన భర్త బాధ్యతలో, కర్తవ్య దీక్షలో తను కూడా పాలుపంచుకొని ఆదర్శ గృహిణిగా మారిన మహాసాధ్వి సీతాదేవి'. రాముడు తండ్రికి ఇచ్చిన మాటకు కట్టుబడి అరణ్యవాసానికి వెళ్లినప్పుడు తన భర్త అడుగుజాడల్లో తనూ నడిచి, అతని కష్టసుఖాల్లో పాలు పంచుకోవడానికి సిద్దమైన ధర్మపత్నిగా తన ధర్మాన్ని నిర్వర్తించింది. దయాశీలి: పేదవారిని ఆదరించి అన్నం పెట్టాలన్న దయాగుణం గల స్త్రీమూర్తి సీత. అదే భావనతో తనింటికి మారువేషంలో బిక్షాటన వచ్చిన రావణుడికి లక్ష్మణరేఖ దాటి మరీ భిక్షం వేసిన దయామూర్తి ఆమె. తన రక్షణ కోసం పెట్టుకున్న నియమం కన్నా దానమే గొప్పదన్న నీతిని ఆమె ఈ సందర్భంలో వెల్లడిస్తున్నది. ధైర్యశాలి: పాతివ్రత్య నిరూపణ కోసం సీతను అగ్నిప్రవేశం చేయమని రాముడు అడిగినప్పుడు ధీరత్వంతో ఆ పనికి సిద్ధమైన ధైర్యశాలి సీత. రాముని మాటలు ఆమె గుండెను గాయపరిచినా సహనంతో భరించింది. తానే తప్పు చేయలేదన్న ఆమె ఆత్మవిశ్వాసం చివరికి నిందారోపణ చేసిన వారిని సైతం తలదించుకునేలా చేసింది. అబిమానవతి: సీతకు ఆత్మాభిమానం ఎక్కువ. చిత్రకూటానికి సీతారాములు వచ్చారని తెలిసి, ఆమె తండ్రి జనకుడు వారిని కలిసి వనవాసం పూర్తయ్యేదాకా మిథిలానగరానికి వచ్చి తనతో పాటు ఉండమని కోరినప్పుడు, ఆ మాటలను సున్నితంగా తిరస్కరించిన ఆత్మాభిమాని సీత. మెట్టినింటికొచ్చాక ఎన్ని విషమ పరిస్థితులెదురైనప్పటికీ తమే పరిష్కరించుకోవాలి గానీ, పుట్టింటి వారిని ఇబ్బంది పెట్టకూడన్న అభిమానవతి సీత. జంతు ప్రేమికురాలు: ప్రకృతి మీద, పశుపక్ష్యాదుల మీద ఎనలేని ప్రేమ కలిగిన స్త్రీమూర్తి సీత. అదే ప్రేమతో అందమైన జింకను తన కోసం తీసుకురమ్మని భర్తను అభ్యర్థిస్తుంది సీత. వివేక వంతురాలు: రావణాసురుడు తనను అపహరించి తీసుకెళ్లి పోతున్నప్పుడు, రాముడికి తన ఆనవాళ్లు చిక్కడం కోసం బంగారునగలను నేల మీద జారవిడిచిన వివేకవంతురాలు సీత. ప్రేమమూర్తి: సీతకు రామునిపై ఎంతటి ప్రేమాను రాగాలంటే..ఆ ప్రేమలో తనను తానే మైమరిచిపోయేది. రావణుడి చెరలో బందీగా ఉండి కూడా నిత్యం శ్రీరామనామస్మరణ చేస్తూ అను క్షణం పతి క్షేమాన్ని కోరేది. చైతన్యశీలి: సీత ఎంత చైతన్యశీలి అంటే అపా యంలో కూడా భయంతో ఆమె శత్రువులకు లొంగలేదు. రావణుడు సీతను బెదిరించి, తన వశం కావాలని ఆదేశించినప్పుడు, ఒక గడ్డిపరకను అడ్డంగా పెట్టుకొని నువ్వు నాకు దీనితో సమానం అని చెప్పకనే చెప్పి అతని ధర్మహీనతను ప్రశ్నించిన ప్రజా వంతురాలామె. క్షమాగుణం: రాక్షస సంహారం తర్వాత సీతను అశోకవనం నుంచి విడిపించి తీసుకువెళ్తున్న సమయంలో, తను బందీగా ఉన్నప్పుడు ఆ వనంలో తనను మాటలతో హింసించిన రాక్షసులకు ఏ కీడు తల పెట్టవద్దని, వారు స్వామిభక్తితో తమ బాధ్యతను మాత్రమే నిర్వర్తించారని హనుమంతునితో చెప్పిన క్షమాగుణం సీత సొంతం. ఆదర్శమూర్తి: అడవిలో ఆశ్రమవాసిగా కాలం గడుపుతూ కూడా తన కుమారులను ప్రయోజకుల్ని చేయాలని ఎల్లవేళలా తపిస్తూ, వారిని కార్యసాధకులుగా తీర్చిదిద్దడం ఆమె ఉత్తమ పెంపకానికి నిదర్శనం.

# అభివృద్ధిలో అగ్రగామిగా తెలంగాణ

### కరీంనగర్ ఎంపీ వినోద్‌కుమార్

బెజ్జంకి : ఉద్యమాల ద్వారా సాధించుకున్న ప్రత్యేక రాష్ట్రంలో ప్రభుత్వం ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా పని చేస్తోందని, అభివృద్ధిలో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపిందని కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు బోయినిపల్లి వినోద్‌కుమార్ అన్నారు. ప్రభుత్వ పాలనపై ప్రజల్లో విశ్వాసం పెరిగిందని, ఎన్నికల హామీలను అమలు చేస్తూ గడిచిన మూడున్నర ఏళ్లలో సాధించిన ప్రగతే నిదర్శనమని పేర్కొన్నారు. మండలంలోని వడ్లూర్‌లో రూ.1.63 కోట్లతో విద్యుత్తు ఉపకేంద్రం, రూ.90 లక్షలతో ఉపమార్కెట్ యార్డు, రూ.13 లక్షలతో గ్రామ పంచాయతీ భవనం, రూ.10లక్షల చొప్పున నిధులతో మంజూరైన మహిళ, అంబేడ్కర్ భవన నిర్మాణాల శంకుస్థాపనలకు రాష్ట్ర సాంస్కృతిక సారథి ఛైర్మన్, శాసనసభ్యుడు రసమయి బాలకిషన్‌తో కలిసి హాజరయ్యారు. డప్పు చప్పుళ్లు, మంగళహారతులతో గ్రామస్థులు ఎంపీ, ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎంపీ వినోద్ మాట్లాడుతూ ఏ ఆశయాల కోసం ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకున్నామో అందుకు అనుగుణంగా సీఎం కేసీఆర్ అహర్నిశలు శ్రమిస్తున్నారని అన్నారు. తాగు, సాగునీటి ప్రాజెక్టులు, విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. కొత్తగా గురుకులాల ఏర్పాటుతో మెరుగైన విద్యను అందుబాటులోకి తెచ్చిందని, ఒక్కో విద్యార్థిపై రూ.1.20 లక్షల చొప్పున ఖర్చు చేస్తుందన్నారు. అధికారంలోకి ఉన్నప్పుడు ఏమీ చేయలేని పొన్నం ప్రభాకర్ కరీంనగర్‌లో వైద్య కళాశాల ఏర్పాటుకు దీక్ష చేస్తుండటం శోచనీయమన్నారు. అదే 2014 నుంచి సీఎం కేసీఆర్ చొరవతో కరీంనగర్‌కు రైల్వే లైన్, వేలాది కోట్ల రూపాయలతో రహదారుల నిర్మాణాలు, ఇతర పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. కరీంనగర్ సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఇప్పటికే వివిధ పనులకు కోట్లాది రూపాయలు మంజూరు చేసిందన్నారు. పెరిగిన ఫ్లోరైడ్ నీటి వాడకం ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని, అందుకే మిషన్ భగీరథ కింద త్వరలోనే ఇంటింటికి సురక్షిత తాగునీరు అందించనుందని తెలిపారు. ఎమ్మెల్యే బాలకిషన్ మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలు గొప్పగా బతకాలన్నా సంకల్పంతో ప్రభుత్వం పని చేస్తోందని, మునుపెన్నడు లేని విధంగా ప్రజల గుండెకు హత్తుకునే సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులకు కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తోందన్నారు. అనంతరం పలువురు మహిళలు ఎంపీ, ఎమ్మెల్యేకు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. గ్రామానికి ఆర్టీసీ బస్సుల కొరత ఉందని గ్రామస్థులు తెలుపగా పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు శరత్‌రావు, ఎంపీపీ దామోదర్, ఏఎంసీ ఛైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచి ప్రేమల, ఎంపీటీసీ సభ్యురాలు మల్లవ్వ, మండల అధ్యక్షుడు రామక్రిష్ణారెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్, విద్యుత్తు ఎస్‌ఈ కరుణాకర్, ఏడీ ఆంజనేయరావు, ఉప సర్పంచి లచ్చిరెడ్డి, నర్సయ్య, అజీముద్దీన్, రవీందర్‌రెడ్డి, నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

రోజుకి రూ. 25/- మాత్రమే
Size 1x3
విజయభాను క్లాసిఫైడ్స్
Minimum 7 days
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్: 2564353, 2569004

## చేనేత కార్మికుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

### జాతీయ చేనేత దినోత్సవంలో కలెక్టర్ డా.గౌరవ్‌ఉప్పల్



నల్గొండ : చేనేత కార్మికుల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాయని కలెక్టర్ డా.గౌరవ్‌ఉప్పల్ తెలిపారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టరేట్‌లోని ఉదయాదిత్య భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పథకాలను పరిశీలిస్తూ సక్రమంగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రతి మూడు నెలలకోసారి సమావేశం ఏర్పాటు చేసి చేనేత కార్మికుల సమస్యలపై చర్చించి తగిన చర్యలు తీసుకుంటామని కార్మికులకు హామీ నిచ్చారు. నేత కార్మికులకు ముద్రరుణాలు విరివిగా మంజూరు చేసేవిధంగా బ్యాంకర్లతో సమావేశం ఏర్పాటు చేసి సమీక్షించాలన్నారు. చేనేత కార్మికులకు అంత్యోదయ కార్డులు, డబుల్‌బెడ్‌రూంలు మంజూరుకు ఉన్న అవకాశాలను పరిశీలించాని జేసీకి సూచించారు. చేనేత కార్మికులకు రాష్ట్రప్రభుత్వం థిఫ్ట్ డిపాజిట్ పథకం కింద కార్మికుడు 8శాతం చెల్లిస్తే ప్రభుత్వం 16శాతం చెల్లిస్తుందని వివరించారు. జేసీ సి.నారాయణరెడ్డి మాట్లాడుతూ చేనేత కార్మికులకు, చేనేత రంగానికి ప్రభుత్వం సహకారం అందిస్తున్నదని వివరించారు. చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంజి మురళీధర్ మాట్లాడుతూ నేత కార్మికులకు రద్దైన ఆరోగ్యబీమా పథకాన్ని పునరుద్ధరించాలన్నారు. ఈ సందర్భంగా చేనేత రంగంలో కృషిచేసిన చిలుకూరి సత్తయ్య (ఘట్టుప్పల్), సింగం గిరిధర్(మునుగోడు), జెల్ల జితేష్ (నర్సింగ్‌భట్ల)ను సన్మానించారు.

అంతకు ముందు రామగిరిలోని గాంధీ విగ్రహానికి కలెక్టర్ పూలమాల వేశారు. నేత కార్మికులు కలెక్టరేట్ వరకు ప్రదర్శన చేపట్టారు. కార్యక్రమంలో చేనేత జౌళిశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సంజీవరావు, చేనేత సొసైటీ నాయకులు దత్త గణేష్, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంజిమురళీధర్, మిర్యాల యాదగిరి, పవర్‌లూం సంఘం ఉపా ధ్యక్షుడు పొట్టబత్తిని సత్యనారాయణ, జాతీయ యువజన అవార్డుగ్రహిత గంజిరాజేందర్, బావన్ల అంజనేయులు పాల్గొన్నారు.

## దివ్యమానవ నిర్మాణంతో ఉన్నతి

నిజామాబాద్ : దివ్యమానవ నిర్మాణంతోనే సమాజ ఉన్నతి సాధ్యమని కామారెడ్డి ఆర్షగురుకులం బ్రాహ్మమహా విద్యాలయం వ్యవస్థాపకులు బ్రహ్మానందసరస్వతి స్వామిజీ పేర్కొన్నారు. ఆర్య సమాజ్ ఇందూరు శాఖ ఆధ్వర్యంలో జిల్లాకేంద్రం కస్బాగల్లీ సమాజ్ ప్రాంగణంలో శ్రావణి వేద సప్తాహం, యజుర్వేద యజ్ఞ పారాయణం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉదయం యాజ్ఞికులు ఆచార్య వేదమిత్ర నేతృత్వంలో వర్షేష్టియాగాన్ని జరిపారు. రక్షాబంధన్, ఓంధ్వజారోహణం చేశారు. సాయంత్రం జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్వామిజీ పాల్గొని భక్తులనుద్దేశించి వైదిక ప్రవచనాలు చేశారు. పండిత ప్రణవకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన వైదిక భజనలు అలరించాయి. ఈ కార్యక్రమంలో దశరథ్, రామలింగం, రాజావిక్రం, సుధాకర్ దంపతులు, విజయ్‌కుమార్, పద్మ, యోగా సాధకులు తదితరులు పాల్గొన్నారు.

## సతీష్ అందరివాడు: మంత్రి

నేరడ : దివంగత దుబ్బాక సతీష్‌రెడ్డి ఆశయ సాధనకు తనవంతు సహకారాన్ని అందిస్తానని మంత్రి జి.జగదీష్‌రెడ్డి హామీ ఇచ్చారు. గతనెల 28న నార్కట్‌పల్లి వద్ద రోడ్డు ప్రమాదంలో అసువులు బాసిన సతీష్‌రెడ్డి సంస్మరణ సభ నేరడలో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అధ్యక్షతన నిర్వహించారు. గ్రామ కూడలిలో ఏర్పాటు చేసిన సతీష్‌రెడ్డి విగ్రహాన్ని మంత్రి ఆవిష్కరించి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. సంస్మరణ సభలో మంత్రి మాట్లాడారు. ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ సతీష్‌రెడ్డి స్మారకంగా పేదలకు ఉపయోగపడేలా కల్యాణ మండప నిర్మాణం చేపట్టనున్నట్లు ప్రకటించారు. ఎమ్మెల్సీలు కర్నె ప్రభాకర్, పల్లా రాజేశ్వరరెడ్డి, ఎమ్మెల్యేలు గాదరి కిషోర్, ఎం.సుధీర్‌రెడ్డి, వేముల వీరేశం, సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు, తెరాస నల్గొండ నియోజకవర్గ బాధ్యుడు దుబ్బాక నర్సింహారెడ్డిలు మాట్లాడారు. శాసనమండలి డిప్యూటీ ఛైర్మన్ నేతి విద్యాసాగర్, రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ ఛైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్‌రెడ్డి, రామవత్ రవీంద్ర నాయక్, గుత్తా జితేందర్‌రెడ్డి, సీపీఐ జిల్లా నాయకుడు ఎం.ఆదిరెడ్డి, ఐసీడీఎస్ ఆర్గనైజర్ మాలె శరణ్యారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సారెస్పీకి పునరుజ్జీవం - ఈటల



ఆర్మూర్ : రివర్స్‌పంపింగ్‌తో శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు పునరుజ్జీవం తీసుకొస్తామని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. ఆయన ఆర్మూర్‌లో ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి నివాసంలో విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా చలో పోచంపాడు గోడప్రతులను ఆవిష్కరించారు. మంత్రి మాట్లాడుతూ గోదావరి ఎగువన మహారాష్ట్రలో వందలాది చెక్‌డ్యాంల నిర్మాణంతో శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు నీళ్లు రావడం లేదని..దీంతో ప్రాజెక్టు ఆయకట్టు, ఎత్తిపోతల పథకాలకు సాగునీరు అందడం కష్టంగా ఉందన్నారు. ఈ పరిస్థితిని అధిగమించడానికే మేడిగడ్డ నుంచి రివర్స్‌పంపింగ్‌ద్వారా గోదావరి నీటిని తీసుకొచ్చి శ్రీరాంసాగర్ ప్రాజెక్టును నింపుతామన్నారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పునరుజ్జీవ పథకానికి ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ నెల 10న పోచంపాడులో శంకుస్థాపన చేయనున్నారని, భారీ బహిరంగసభను విజయవంతం చేయాలన్నారు. ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## పోచంపాడు కేసీఆర్ సభకు హుస్నాబాద్ నుంచి 5 వేల మంది

### ముఖ్య కార్యకర్తల సమావేశంలో శాసనసభ్యుడు సతీష్‌కుమార్

హుస్నాబాద్ : శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పునరుద్ధరణకు ఈనెల 10న పోచంపాడులో నిర్వహించనున్న సీఎం కేసీఆర్ బహిరంగ సభకు హుస్నాబాద్ నియోజకవర్గం నుంచి 5 వేల మంది తరలి వెళ్లాలని నిర్ణయించినట్లు శాసనసభ్యుడు వొడితల సతీష్‌కుమార్ తెలిపారు. నియోజకవర్గంలోని ఏడు మండలాల ముఖ్య కార్యకర్తలు, పార్టీ ప్రజాప్రతినిధులతో హన్మకొండలోని తన నివాసంలో ఆయన సమావేశమయ్యారు. రూ.2 వేల కోట్లతో శ్రీరాంసాగర్ ప్రాజెక్టును పునరుద్ధరించాలని ప్రభుత్వం నిర్ణయించడం గొప్ప విషయమన్నారు. ఇప్పటికే రూ.1500 కోట్లతో నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. రానున్న రెండు సంవత్సరాల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. గౌరవెల్లి, గండిపల్లి ప్రాజెక్టుల నిర్మాణంపై సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు ప్రత్యేక దృష్టితో ఉన్నారన్నారు. మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ పనులను మరింత వేగవంతం చేసేందుకు అధికారులతో సమీక్షలు జరుపుతున్నారన్నారు. వచ్చే ఏడాది జరుగనున్న సహకార సంఘాల ఎన్నికలు, పంచాయతీ ఎన్నికలకు కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు సన్నద్ధం కావాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి వివరించాలన్నారు. మా వూరు, మా ఎమ్మెల్యే కార్యక్రమం పేరిట ఇప్పటికే నియోజకవర్గంలో పది గ్రామాలను సందర్శించి ప్రజల సమస్యలను తెలుసుకున్నామన్నారు. మిగిలిన గ్రామాల్లోనూ పర్యటిస్తామన్నారు.

సమావేశంలో హుస్నాబాద్, కోహెడ, చిగురుమామిడి, అక్కన్నపేట, ఎల్కతుర్తి, భీమదేవరపల్లి, సైదాపూర్ మండలాల పార్టీ ప్రజాప్రతినిధులు, ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రాణం తీస్తున్న వేగం

### లైసెన్స్‌లు లేకుండా నడుపుతున్న డ్రైవర్లు



మహబూబ్‌నగర్ : కోయిలకొండ మండలం పారుపల్లి వద్ద 2తేదీన పెళ్లికి వెళ్లి వస్తున్న ట్రాక్టర్ బోల్తా పడింది. ఈ ఘటనలో ఆరేళ్ల చిన్నారి మౌనిక అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. మితిమీరిన వేగంతో ట్రాక్టర్ నడిపి అదుపు చేసే క్రమంలో సాధ్యం కాకపోవడంతో ట్రాలీ అదుపు తప్పి బోల్తా పడింది. ట్రాక్టర్ నడిపిన ట్రాక్టర్ డ్రైవర్‌కు అసలు లైసెన్స్ లేదు. మక్తల్ మండలం బొందల్‌కుంట గ్రామ మలుపు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో సైతం మితిమీరిన వేగం ఉందని అధికారులు గుర్తించారు. మక్తల్‌లో సంత కావడంతో చుట్టు పక్కల గ్రామాల వారు వెళ్లి సరకులు కొనుగోలు చేసి వెళుండగా బొందల్‌కుంట మలుపు వద్ద ఓ గొర్రె రహదారిపైకి రావడంతో దాన్ని తప్పించబోయి ఎదురుగా వస్తున్న లారీని ఢీ కొట్టడంతో ఒకేరోజు ఆటో డ్రైవర్‌తో సహా ఆరుగురు మృతి చెందారు.

జిల్లాలో రోడ్డు ప్రమాదాలు కేవలం మితిమీరిన వేగంతోనే అధికంగా జరుగుతున్నాయి... చాలా మందికి అనుభవం లేకపోవడం.. కనీసం లైసెన్స్‌లు లేని వారు ఆటోలు.. ట్రాక్టర్లు నడుపుతున్న పరిస్థితి ఉంది.. దీంతో పాటు కొన్ని వాహనాలకు బీమా సౌకర్యం సైతం ఉండటం లేదు.. ఫలితంగా ప్రమాదాలు జరిగినప్పుడు బాధితులకు పరిహారం సైతం రావడం లేదు.. పోలీసు శాఖ తరపున అవగాహన కార్యక్రమాలు.. తనిఖీలు నిర్వహిస్తున్న ఫలితాలు ఆశించిన మేర రావడం లేదు.. ఇంకా అధికారులు లోపాలను సమీక్షించుకొని వాటిని సరి చేసుకొని ముందుకు వెళ్లకపోతే మాత్రం ప్రమాదాల పరిస్థితి ఇదే విధంగా కొనసాగుతుంది.

జిల్లాలో ఆర్టీసీ బస్సులు వెళ్లని గ్రామాలు చాలానే ఉన్నాయి. అయితే ఈ గ్రామాలు, తండాలకు ఆటోలు దిక్కు అవుతున్నాయి. అయితే తొందరగా ఇళ్లు చేరుకోవాలనే ఆలోచనతో ఎక్కువ మందిని ఆటోల్లో ఎక్కించుకుంటున్నారు.

రహదారులపై నిబంధనలను అతిక్రమించి వేగంతో వాహనదారులు వెళ్తున్న పరిస్థితి ఉంది. జిల్లాలో జాతీయ రహదారిపై కార్లు 100..ద్విచక్ర వాహనాలు.. బస్సులు..లారీలు 80 కి.మీ వేగంతో వెళ్లాలి. ఆటోలు అయితే కేవలం 60 కి.మీ వేగంతో మాత్రమే వెళ్లాల్సి ఉంటుంది. కాని వాహనదారులు మాత్రం ఇంతకు మించి వేగంతో రాష్ట్ర రహదారులపైనే వెళ్తున్న పరిస్థితి ఉంది.

## నాటిన ప్రతిమొక్కకు జియోట్యాగింగ్ అవసరం

నల్గొండ : ఈ నెల 15న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ డా.గౌరవ్‌ఉప్పల్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఏర్పాట్లు పూర్తిచేయాలన్నారు. ఉదయం పరేడ్‌గ్రౌండ్‌లో జాతీయపతాకావిష్కరణ, గౌరవవందన స్వీకారం, ముఖ్యఅతిథి ప్రసంగం, సాంస్కృతిక కార్యక్రమాలు, అభివృద్ధి శకటాల ప్రదర్శన, వివిధ శాఖల్లో అత్యుత్తమ సేవలు అందించిన వారికి ధ్రువీకరణ పత్రాల ప్రధానం ఉంటుందన్నారు. వివిధ ప్రభుత్వ శాఖలచే లబ్ధిదారుకలు ఆస్తుల పంపిణీ తదితర కార్యక్రమాలకు ఒకొక్క విభాగానికి ఒక్కో జిల్లా అధికారిని ఇన్‌ఛార్జిగా నియమించాలన్నారు. నాటిన ప్రతి మొక్కకు జియోట్యాగింగ్ చేయాలని తెలిపారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో మహిళలు పిల్లల రక్షణకు భరోసా కేంద్రాన్ని ప్రారంభించేందుకు ప్రణాళిక రూపొందించడం జరిగిందన్నారు. అనంతరం బాలికా రక్షాబంధన్ కింద మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జిల్లా అధికారులకు బాలికలు రక్షాబంధనం కట్టారు. కార్యక్రమంలో జేసీ సి.నారాయణరెడ్డి, డీఎఫ్‌వో శాంతారాం, డీఆర్‌వో భీమ్యానాయక్, హనుమానాయక్ తదితరులు పాల్గొన్నారు.

### మార్కెట్లకు మహర్దశ

# అభివృద్ధికి నిధుల కేటాయింపు

నిర్మల్ : సరైన షెడ్లు, ప్లాట్ ఫాంలు, సౌకర్యాలు లేక కూరగాయల మార్కెట్‌కు వచ్చే కొనుగోలుదారులు, విక్రయదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిన్నపాటి వర్షం కురిస్తే పూర్తిగా బురదమయమై కష్టాలు పడుతున్నారు. అలాంటి సమస్యలను తీర్చేందుకు పురపాలక సంఘం వారు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. 14 ఆర్థిక సంఘం నిధులతో నిర్మల్ పట్టణంలో ఉన్న రెండు మార్కెట్లను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలను రూపొందించారు.

నిర్మల్ పట్టణంలో సమగ్ర కుటుంబ సర్వే నివేదిక ఆధారంగా 1,36,342 మంది జనాభా ఉన్నారు. ప్రజల సౌకర్యార్థం పురపాలక సంఘం పట్టణంలో గుల్జార్ మార్కెట్, గాంధీపార్కు వద్ద కూరగాయల మార్కెట్లను ఏర్పాటు చేశారు. నిత్యం వందల సంఖ్యలో ప్రజలు వచ్చి ఈ మార్కెట్లలో కూరగాయలు, మాంసం, చేపలను కొనుగోలు చేసి తీసుకెళ్తుంటారు. అయితే సరైన సౌకర్యాలు లేకపోవడంతో మార్కెట్లకు వచ్చే కొనుగోలుదారులతో పాటు విక్రయదారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా ఆయా గ్రామాల నుంచి రైతులు పెద్ద ఎత్తున తెల్లవారుజామునే మార్కెట్‌కు కూరగాయలు, తదితర వాటిని తీసుకొని వస్తుంటారు. అయితే మార్కెట్‌లో సరైన విద్యుద్ధీకరణ లేకపోవడంతో చీకటి నెలకొంటోంది.కూరగాయలు విక్రయించేందుకు సరైన ప్లాట్ ఫారాలు గాని, షెడ్లు గానీ లేవు. దీంతో వర్షం కురిసిన సమయంలో మార్కెట్ అంతా బురదమయమవుతోంది. వారి ఇబ్బందులను దూరం చేసేందుకు 14వ ఆర్థిక సంఘం నిధులతో రెండు మార్కెట్ల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించారు. ఇందులో గుల్జార్ మార్కెట్ వద్ద అభివృద్ధి పనుల కోసం రూ. 10లక్షలు, గాంధీపార్కు వద్ద ఉన్న కూరగాయల మార్కెట్ అభివృద్ధికి రూ. 26లక్షలు కేటాయించారు. ఈ పనులను చేపట్టేందుకు టెండర్లు నిర్వహించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

మార్కెట్లలో కొనుగోలు దారులు, విక్రయదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు తొలగనున్నాయి. ఆయా మార్కెట్లలో ఫ్లాట్ ఫారాల నిర్మాణం, విక్రయిదారులకు ఎండ నుంచి, వర్షం నుంచి రక్షణగా షెడ్లు, మార్కెట్ అంతా సిమెంట్ ఫ్లోరింగ్, తాగు నీటి వసతి, విద్యుద్ధీకరణ వంటి అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. దీంతో మార్కెట్‌కు వచ్చే రైతులు, విక్రయ దారులతో పాటు కొనుగోలుదారుల కష్టాలు తొలగనున్నా యి. అయితే పనులను పూర్తిస్థాయిలో పకడ్బందీగా చేపట్టి కలకాలం ఉండేలా చూడాలని పట్టణవాసులు కోరుతున్నారు. టెండర్ల నిర్వహణ పూర్తయితే మార్కెట్లలో నెలకొన్న కష్టాలు దూరం కానున్నాయి.

## ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి ప్రథమ ప్రాధాన్యం: కలెక్టర్

ఖమ్మం : ప్రజల నుంచి అందిన ఫిర్యాదుల సత్వర పరిష్కారానికి అంకితభావంతో పనిచేయాలని కలెక్టర్ లోకేశ్ కుమార్ అధికారులను ఆదేశించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన గ్రీవెన్స్‌డేలో జేసీ వినయ్‌కృష్ణారెడ్డితో కలసి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఫిర్యాదుల పరిష్కారానికి ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలన్నారు.

జిల్లాలో హరితహారం కార్యక్రమంలో 73 శాతం మొక్కలు నాటి రాష్ట్ర స్థాయిలో ముందున్నామన్నారు. మరో వారం రోజుల్లో నూరు శాతం లక్ష్యం సాధించాలన్నారు. అక్టోబరు 2వ తేదీ నాటికి బహిరంగ మల, మూత్ర విసర్జన రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని, ఈలోగా మిగిలిన 45 వేల వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం పూర్తి చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు.

స్వాతంత్ర్య దినోత్సవం నిర్వహణకు ఏర్పాట్లు సకాలంలో పూర్తి చేయాలన్నారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకం అమలులో రాష్ట్ర ప్రభుత్వం వాటా చెల్లించకపోవడంతో జిల్లా రైతులకు మంజూరు రూ.17 కోట్ల మేర పరిహారం నిలిచిపోయిందని, దీనిపై సత్వర చర్యలు తీసుకుని న్యాయం జరిగేలా చూడాలని భాజపా రాష్ట్ర కార్యదర్శి కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, గుత్తా వెంకటేశ్వరరావు వినతిపత్రం అందించారు.

గత నెల 26న ఖమ్మంలోని ఒక ఆసుపత్రిలో తనకు ఒకే కాన్పులో నలుగురు పిల్లలు జన్మించారని, కూలీ పనిచేసుకుని బతికే తమ కుటుంబానికి నలుగురు పిల్లలను పోషించే ఆర్థిక స్థోమత లేనందున ఆర్థిక సాయం అందించాలని తిరుమలాయపాలెం మండలం గోల్‌తండాకు చెందిన సయ్యద్ షమీన కోరారు.

ఖమ్మంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో సహాయకురాలిగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన ఎన్.శిరోమణికి పింఛను మంజూరు చేయాలని హైకోర్టు ఆదేశించినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆమె మనుమడు శ్రీనివాస్ వినతిపత్రం అందించారు.

తాము తీసుకున్న పంట రుణాలకు సంబంధించి రెండు విడతల మాఫీ నగదు ఖాతాలకు ఇంకా జమ కాలేదని, ఇదేమిని అడిగితే ఖమ్మంలోని సెంట్రల్ బ్యాంకు అధికారులు సరైన వివరాలు చెప్పకుండా అప్పు రెండింతలుందని, దాన్ని చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారని రఘునాథపాలెం మండలం మంచుకొండకు చెందిన మందడపు వీరయ్య, మందడపు సత్యనారాయణ, తాళ్లూరి ప్రకాశరావు వాపోయారు.

# వర్షాకాలంలో సౌందర్య రక్షణ



వర్షాకాలం వచ్చేసింది. చిటపట చినుకుల్లో సరదాగా ఎంజాయ్ చేయాలని చాలామందికి ఉంటుంది. అలాగే హాట్ సమ్మర్ నుంచి చల్లటి అనుభూతిని ఆస్వాదించడానికి అందరూ ఇష్టపడతారు. అయితే.. చర్మ సమస్యలు కూడా వర్షాకాలంలో చాలా ఎక్కువగా ఎదురవుతాయి. కాబట్టి.. చాలా కేర్‌ఫుల్‌గా ఉండాలి. వర్షాకాలంలో చర్మం ఎక్కువగా పొడిబారడం, యాక్నె, పింపుల్స్, ఇతర చర్మ సమస్యలు ఎక్కువగా వచ్చే అవకాశాలుంటాయి.

గాలిలో ఉండే దుమ్ము, ధూళి చర్మానికి హానిచేస్తాయి. కాబట్టి సరైన జాగ్రత్తలు తీసుకుంటే.. వర్షాకాలాన్ని మీరు అనుకున్న విధంగా ఎంజాయ్ చేస్తూనే.. అందంగా మెరిసిపోవచ్చు. స్మార్ట్ లుక్ కోసం..

**అమ్మాయిలు వేసుకోవాల్సిన ఫేస్ ప్యాక్స్ :**

వర్షాకాలంలో చర్మాన్ని ఎలా సంరక్షించుకోవాలి, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి అనే విషయాన్ని ఇప్పుడు మీరు తెలుసుకోబోతున్నారు. ఈ చిట్కాలు కేవలం చర్మాన్ని సంరక్షించడమే కాకుండా.. చర్మాన్ని ప్రకాశవంతంగా మారుస్తాయి. కాస్మొటిక్స్ అవసరం లేకుండానే వర్షాకాలంలో మీరు మెరిసిపోవచ్చు.

**వర్షాకాలంలో చర్మం నిర్జీవంగా మారకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు :**

వీలైతే రెండుసార్లు ఫేస్ వాష్ చేసుకోవడం వలన వర్షాకాలంలో చర్మం దుమ్ము, క్రిములు, కాలుష్యానికి ఎక్కువగా ఎక్స్ పోజ్ అవ్వాల్సి వస్తుంది. ఇది చర్మానికి చాలా హానికరం. కాబట్టి.. ముఖాన్ని ఖచ్చితంగా.. రెండు సార్లు శుభ్రం చేసుకోవడం వల్ల దుమ్ము తొలగిపోతుంది.

**టోనర్ :**

ఆల్కహాల్ ఫ్రీ టోనర్ ఉపయోగించడం వర్షాకాలంలో చాలా అవసరం. ముఖ్యంగా డ్రై స్కిన్ ఉన్నవాళ్లు.. ఇంకా డ్రైకాకుండా ఉండాలంటే.. టోనర్ కంపల్సరీ వాడాలి. ఒకవేళ ఆయిలీ స్కిన్ ఉంటే.. ఆస్ట్రిజెంట్ ఉపయోగించడం మంచిది.

**వాటర్ ప్రూఫ్:**

మేకప్ వర్షాకాలంలో ఎక్కువ మేకప్ వేసుకుంటే.. ఏమీ బాగోదు. కానీ.. వాటర్ ప్రూఫ్ మేకప్ వాడితే.. ఎలాంటి నష్టం ఉండదు. అవి అయితే చెదిరిపోకుండా ఉంటాయి.

**మాయిశ్చరైజర్:**

చర్మాన్ని రోజంతా మాయిశ్చరైజింగ్ గా ఉంచడం చాలా అవసరం. అయితే మాయిశ్చరైజర్ ని రెగ్యులర్ గా అప్లై చేస్తూ ఉంటే.. చర్మం పొడిబారకుండా ఉండటానికి సహాయపడుతుంది.

వారానికి ఒకసారి ఎక్స్ఫోలియేట్ డెడ్ స్కిన్ సెల్స్ నివారించడానికి.. చర్మాన్ని ఎక్స్ ఫోలియేట్ చేయడం చాలా అవసరం. అయితే వారానికి ఒకసారి కంపల్సరీ హోంమేడ్ స్క్రబ్ ఉపయోగించి.. డెడ్ స్కిన్ సెల్స్ తొలగించుకోవడం వల్ల.. చర్మం నిగారిస్తుంది.

సన్ స్క్రీన్ వాతావరణం చల్లగా, డార్క్‌గా ఉన్నప్పుడు చాలామంది సన్ స్క్రీన్ లోషన్ వాడకుండా ఉంటారు. ఇది చాలా పొరపాటు. ఎందుకంటే.. కొన్ని సెకన్ల పాటు సూర్య కిరణాలు పడినా.. చర్మానికి చాలా హానికరం. కాబట్టి బయటకు వెళ్లేటప్పుడు ఖచ్చితంగా.. కొంచెం సన్ స్క్రీన్ లోషన్ అప్లై చేయాలి.

ఎక్కువగా నీళ్లు తాగాలి: ఎక్కువ నీళ్లు తాగడం వర్షాకాలంలో చాలామంది వాతావరణం చల్లగా ఉండటం వల్ల నీళ్లు సరిగా తాగరు. కానీ.. వర్షాకాలంలో.. అయినా సరే నీళ్లు ఎక్కువ గా తాగడం వల్ల... హైడ్రేట్‌గా ఉంటారు. దీనివల్ల చర్మం ఫ్రెఫ్ గా, అందంగా కనిపిస్తుంది.

# 'షుగర్' గాయాలు మానాలంటే...?

న్యూయార్క్: మనకేదైనా గాయమైతే కొంచెం ఇబ్బంది. అదే మధుమేహ వ్యాధిగ్రస్తులకు ఏదైనా గాయమైతే ఇక చెప్పనక్కర్లేదు ఆ అవస్థ! గోరు చుట్టుపై రోకటి పోటులా మానేవరకు మహా ఇబ్బంది పెట్టేస్తుంది. దీనిపై పరిశోధన జరిపిన యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా డేవిస్ శాస్త్రవేత్త డాక్టర్ మిన్ ఝూవ్ మాత్రం గాయం చుట్టూ స్వల్ప మోతాదులో కరెంటు షాక్‌లివ్వడం ద్వారా నయం చేస ఎకోవచ్చని సూచిస్తున్నారు. మామూలు మనుషులకు గాయ మైనప్పుడు ఆ పరిసరాల్లోని కణాల ద్వారా అందే ఎలక్ట్రిక్ సంకేతాల కారణంగా గాయం మానే ప్రక్రియ మొదలవుతుంది. అదే మధుమేహ వ్యాధిగ్రస్తుల విషయంలో ఈ సంకేతాలు చాలా బలహీనంగా ఉన్నాయని మిన్ ఝూవ్ గ్రహించారు.

గాయం మానడానికి కృత్రిమంగా కరెంటు సంకేతాల శక్తిని పెంచితే త్వరగా నయమవుతుందని అంటున్నారు. గాయమైన చోట అయాన్లు వ్యాపించేలా మందులిస్తే ఈ కరెంటు సంకేతాలు ఎక్కువవుతాయని, లేదంటే నేరుగా కరెంటు షాక్‌లివ్వవచ్చని వివరించారు.



# కేశాలకు కావాలి రక్షణ

ఆరోగ్యం

జాలువారే అందమైన, దట్టమైన జుట్టు చూసేవారిని వెంటనే ఆకర్షిస్తుంది. వారి అందాన్ని పెంచి, వారిని సెంటర్ ఆఫ్ ఎట్రాక్షన్ గా మార్చేస్తుంది. వెన్నల కాంతులు విరబూసే కురులు మరింత నిగనిగలాడాలంటే ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. కాబట్టి మెరుసే కురుల కాంతుల కోసం అందంగా ఆరోగ్యంగా ఎలా ఉంచుకోవాలో చూద్దాం.....

వారంలో రెండు సార్లు తలకు నూనె రాసి, తల మాడు మీద బాగా మసాజ్ చేయాలి. ఇలా చేయడం వల్ల కురులు బాగా పెరగడానికి సహాయ పడుతుంది. జుట్టు సాధారణంగా ఉన్నట్లైతే మైల్డ్ షాంపూ, లైట్ కండీషనర్ ఉపయోగించండి. అయినప్పటికీ కురులకు హాని జరుగుతుంటే గోరువెచ్చని నూనెతో మసాజ్ చేయవచ్చు.

**షాంపూని పూర్తిగా ఉపయోగించాలి:**

హై ఆల్కహాల్ ప్రోడక్ట్స్, బ్లో డ్రయింగ్‌లకు దూరంగా ఉండాలి. తలకు షాంపూచేసిన తర్వాత షాంపూను నీళ్లతో పూర్తిగా తొలగించాలి. కండీషనింగ్ సమయంలో వెంట్రుకల మూలాల్లో లైట్ కండీషనర్ ను ఉపయోగించాలి. అదేవిధంగా తీసుకొనే ఆహారంలో కొవ్వు పదార్థాలు, నెయ్యి, నూనె పదార్థాలను వీలైనంత వరకూ తగ్గించండి. బాగా నీళ్ళు తాగి ఒత్తిడికి దూరంగా ఉండాలి.

**జెంటర్ హెయిరింగ్ సర్ఫింగ్ మాస్క్:**

జుట్టు సన్నగా పల్చగా ఉంటే జెంటర్ హెయిరింగ్ నర్ఫింగ్ మాస్క్ ఉపయోగించండి. ఇది వెంట్రుకలను దట్టంగా ఉండేలా చేస్తుంది. తగినంత తేమను అందిస్తుంది. వనమూలికలు (హెర్బల్స్)ను ఉపయోగించి తయారు చేసిన షాంపూ, గోరింటాకు ఆధారిత కండీషనర్‌లను కూడా వాడవచ్చు. అప్పుడు కురులు దట్టంగా కనిపిస్తాయి. నిగనిగలా డుతాయి.

**జుట్టుకు సహజరంగునే వాడండి:**

రంగు వేసుకొనే జుట్టుకు ప్రత్యేక శ్రద్ధ చాలా అవసరం. వారంలో లేదా 15 రోజులకు ఒకసారి వేడి నీళ్లతో మసాజ్ చేసి నరిషింగ్ ప్యాక్ వేసుకుంటే ఎంతో లాభదాయకంగా ఉంటుంది. దాంతో వెంట్రుకలకు పోషణ లభిస్తుంది. వెంట్రుకలు కూడా జిడ్డుగా మారవు. కురులకు కలర్ చేస్తే యు నీ ఫిల్టర్ ఉన్న కేర్ షాంపూను ఉపయోగించడం మంచిది. ఇది కురులకు కండిషనింగ్ ఇస్తుంది. ఇది ఎండ నుంచి రక్షించడం మాత్రమే కాదు, కేశాలకు కలర్ నిలిచి ఉండేలా చేస్తుంది.

**ఎక్కువ వేడి నీరు వద్దు:**

కురులను శుభ్ర పరచడానికి సాధారణ నీళ్ళతో ఉపయోగించాలి. ఎక్కువ వేడి వున్న నీళ్ళతో కురులను శుభ్ర పరిస్తే జుట్టులో ఉన్న నేచురల్ ఆయిల్ వెళ్లిపోతుంది. దాంతో కురులు పొడిగా, పెళుసుగా మారతాయి. అందుకే సాధారణ నీళ్ళను ఉపయోగిస్తే బాగుంటుంది. చల్లని నీళ్లు కూడా వెంట్రుకులపై ద్రుష్ప్రభావం చూపిస్తాయి. కాబట్టి చలికాలంలో గోరువెచ్చిన నీళ్లు, వేసవిలో సాధారణ నీళ్లను ఉపయోగించాలి.

**ట్రిమ్మింగ్ ముఖ్యం:**

కురులను పొడవుగా చేయడానికి ముందు చిట్లిపోయిన వెంట్రుకులను ట్రిమ్మింగ్ చేయించాలి. ఇలా చేయకపోతే, చిట్లిన కురులు ఇతర కురులను కూడా బలహీనపరుస్తాయి. ఎనిమిది లేదా పది వారాలకు ఒకసారి జుట్టును ట్రిమ్మింగ్ చేయడం మంచిది. జుట్టుకు మెత్తగా లేదా గట్టిగా మార్చే స్టయిలిష్ జెల్‌ని కేవలం ప్రత్యేక సందర్భాల్లోనే ఉపయోగిస్తే మంచిది.

వేళ్ల కణుపుతో స్కాల్ఫ్ మసాజ్ చేయొచ్చు. షాంపూను అప్లై చేస్తున్నప్పుడు కూడా ఇలా చేయవచ్చు. వారంలో 2-3సార్లు హెయిర్ బ్రష్‌తో శుభ్రం చేయండి. దుమ్ము లేదా నూనె వెంట్రుకల్లో చేరకుండా చూడండి.



**నేచురల్ మాయిశ్చరైజర్:**

నేచురల్ హెయిర్ టానిక్ వాడితే వెంట్రుకలకు నేచురల్ మాయిశ్చరైజర్ లభిస్తుంది. వారంలో రెండు సార్లు ఆలివ్ ఆయిల్, బాదం, ఆముదం, నూనెను సమానంగా కలిపి సాయంత్రం ఈ నూనెతో చర్మంపై మసాజ్ చేసి మర్నాడ్ హెర్బల్ షాంపూతో శుభ్రం చేసుకోవాలి. ఇలా చేయడం వల్ల వెంట్రుకుల మూలాలు దృఢంగా మారుతాయి. చాలామంది చర్మానికి, ముఖానికి ఇచ్చే ప్రాముఖ్యతను జుట్టు అందానికి ఇవ్వరు. కొందరు తరచుగా షాంపూలను మారుస్తుంటారు. మార్కెట్లో దొరికే హెయిర్ ఆయిల్స్‌ను వాడుతుంటారు. ఎలా చేసినా వారి జుట్టు చుండ్రుతో నో..మరేదో సమస్యతోనో ఊడి పోతుంటుంది. ఆడవారు ఎంత అందంగా ఉన్నా... జుట్టు అందంతో వారికి మరింత అందం పెరుగుతుంది. కొన్ని రకాల జాగ్రత్తలతో జుట్టును ఒత్తుగా నిగనిగలాడేలా చేసు కోవచ్చు.

1. నిమ్మకాయ రసంతో తలంతా మర్ధన చేసుకున్నా కూడా చుండ్రు నివారణ అవుతుంది. 2. మందార పువ్వులను ఎండబెట్టి కొబ్బరినూనెలో వేసి మరిగించి ఆ మిశ్రమాన్ని చల్లారాక ఒక సీసాలో నిలవచేసుకుని ప్రతిరోజూ రాసుకుంటే చుండ్రు నివారణ అవుతుంది.

3. గోరింటాకు ఎండబెట్టి పొడిగా చేసుకుని కొబ్బరినూనెతో కలిపి రాసుకుంటే వెంట్రుకలు నిగనిగలాడతాయి.

4. పెరుగు, నిమ్మరసం కలిపి మిశ్రమంగా చేసుకుని వెంట్రుకలకు పట్టించినా చుండ్రు నివారణ అవుతుంది.

5. మార్కెట్లో దొరికే కలర్ డైలను ఎక్కువగా వాడకూడదు. సాధ్యమైనంత వరకూ సహజసిద్ధంగా ఉండేలా చూసుకోవాలి. మార్కెట్లో మెహిందీ పొడి దొరుకుతుంది. దానితో సహజసిద్ధమైన డైని తయారుచేసుకుంటే మంచిది. ఎటువంటి సైడ్ ఎఫెక్టులు ఉండవు.


6. ఉసిరికపొడి కూడా జుట్టును నల్లగా మార్చడంలో ప్రముఖపాత్ర వహిస్తుంది.

7. పెద్ద ఉసిరికాయలు (ఆమ్లా) చౌకగా లభ్యమయ్యేకాలంలో వాటిని తీసుకుని ఎండబెట్టి దాని పొడిని గింజలతో సహా దంచుకుని...వాటిని తలకు పట్టిస్తే చుండ్రు, పేలు నివారణ అవుతాయి. 8. మార్కెట్లో లభ్యం అయ్యే చౌకరకాల షాంపూలను, సబ్బులను వాడితే చుండ్రు సమస్య మరింత పెరిగే అవకాశం ఉంది. ఏ

9. బూడిద గుమ్మడికాయ తొక్క, గింజలు కొబ్బరినూనెలో మరిగించి ఆ మిశ్రమాన్ని తలవెంట్రుకలకు రాస్తుంటే అవి సహజసిద్ధమైన మెరుపుతో తన పూర్వాకృతిని పొందుతాయి. జుట్టు మెత్తగా మారి, వెంట్రుకలు పొడవుగా అవుతాయి.

10. ఒక టీ స్పూన్ తేనే, టీ స్పూన్ ఆలివ్ ఆయిల్, టీస్పూన్ నిమ్మరసం కలిపిన మిశ్రమంలో కోడిగుడ్డులోని తెల్లసొనని వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని జుట్టుకి కుదుళ్ళ నుండి పట్టించాలి. 20 నిమిషాల తరువాత తల స్నానం చెయ్యాలి.

# ఆరిపోయిన లివర్ స్విచ్ వెలిగింది..!



వతీకాలేయం.. మన శరీరంలోని అన్ని అవయవాల్లోకీ పెద్దదీ, ప్రత్యేకమైనదీ. అందుకే రక్తసరఫరా విషయంలో కూడా మిగిలిన అన్ని శరీర భాగాలకు ఒకలా ఉంటే, కాలేయానికి మాత్రం ప్రత్యేకంగా ఉంటుంది. సాధారణంగా శరీర భాగాలన్నింటి నుంచి కార్బన్‌డయాక్సైడ్‌తో కూడిన రక్తం గుండెకు, అక్కడి నుంచి ఊపిరితిత్తులకు చేరుతుంది. ఊపిరితిత్తుల్లో వాయుమార్పిడి ద్వారా కార్బన్‌డయాక్సైడ్ తొలగిపోయి, రక్తంలోకి ఆక్సిజన్ చేరుతుంది. ఈ ఆక్సిజన్‌యుత రక్తం తిరిగి గుండెకు చేరుతుంది. గుండె దీన్ని అన్ని శరీర భాగాలకు సరఫరా చేస్తుంది. శరీరంలో కింది వైపు ఉన్న అవయవాలన్నింటి నుంచి ఇన్‌ఫీరియర్ వీనకావా అనే అతి పెద్ద సిర గుండెకు రక్తాన్ని తీసుకువస్తుంది. అయితే జీర్ణ వ్యవస్థకు చెందిన అవయవాల నుంచి రక్తం కాలేయానికి కూడా సరఫరా అవుతుంది. ఆహారం జీర్ణం అయిన తరువాత రక్తం నుంచి పోషకాలను గ్రహించడానికి అది కాలేయానికి వెళుతుంది. ఇలా జీర్ణవ్యవస్థ నుంచి కాలేయానికి రక్తం సరఫరా అయ్యే మార్గాన్ని పోర్టల్ మార్గం అనీ, ఆ రక్తనాళాన్ని పోర్టల్ సిర అనీ అంటారు. ఇందులో తక్కువగా అంటే దాదాపు 60 శాతం మాత్రమే ఆక్సిజన్ ఉంటుంది. అదేవిధంగా గుండె నుంచి హెపాటిక్ ధమని ద్వారా 98 శాతం ఆక్సిజన్‌ను కలిగివున్న రక్తం కాలేయానికి సరఫరా అవుతుంది.

సాధారణంగా ఏ కారణం వల్లనైనా పోర్టల్ సిర మార్గంలో ఎక్కడైనా రక్తంలో అడ్డంకులు ఏర్పడితే, మందుల ద్వారా వాటిని తొలగించి, అవసరమైన సర్జరీ చేసేస్తారు. కాని పైన చెప్పిన పేషెంటు విషయంలో ఈ అడ్డంకు పోర్టల్ సిరలో ఎక్కడో ఒకచోట అని కాకుండా మొత్తం పోర్టల్ మార్గం బ్లాక్ అయిపోయింది. దీన్ని పోర్టో - మీసెంట్రిక్ థ్రాంబోసిస్ అంటారు. దాంతో కాలేయానికి రక్తసరఫరా ఆగిపోయింది. ఇలాంటి క్లిష్టమైన పరిస్థితిలో కాలేయ మార్పిడి చేయడం దాదాపు అసాధ్యం. విజయవంతం అయ్యే అవకాశం దాదాపుగా ఉండదనే చెప్పాలి.

సాధారణ స్థితిలో పేగుల నుంచి రక్తం పోర్టల్ సిర ద్వారా కాలేయాన్ని చేరుతుంది. అదేవిధంగా మిగిలిన శరీర భాగాల నుంచి ఇన్‌ఫీరియర్ వీనకావా ద్వారా గుండెకు చేరుతుంది. ఇక్కడ ఈ రెండు మార్గాలకు మధ్య బ్రిడ్జ్ వేశార న్నమాట. అంటే కాలేయానికి, ఇన్‌ఫీరియర్ వీనకావాకి మధ్యలో ఒక బైపాస్ నాళాన్ని నిర్మించారు. దాంతో రక్తం పేగుల నుంచి ఇన్‌ఫీరియర్ వీనకావాకి, దాని నుంచి గుండెకు, తరువాత గుండె నుంచి కాలేయానికి చేరేలా రూపొందించారు. దీన్నే కావల్ ట్రాన్స్‌పొజిషన్ లేదా కావల్ స్విచ్ ఆపరేషన్‌గా వ్యవహరిస్తారు. పదమూడున్నర గంటల సుదీర్ఘ శ్రమ అనంతరం ఆపరేషన్ సక్సెస్ అయింది. కాలేయ మార్పిడి చేసినప్పటికీ కొత్త కాలేయానికి రక్త సరఫరాలో అంతరాయం లేకపోవడంతో పదిరోజుల్లో రోగి కోలుకునేందుకు వీలయింది. ఎన్ని ట్రాన్స్‌ప్లాంటేషన్లు చేసినా, ఇలాంటి సంక్లిష్టమైన, సవాలుతో కూడిన కేసు ఇదే మొదటిసారి. ఊపితిత్తులు బలహీనంగా ఉన్నప్పటికీ, వెంటిలేటర్ మీద ఉన్న రోగి ఇలా లేచి తిరగడం ఈ ఆధునిక చికిత్స ఫలితమేనంటారు ఆపరేషన్ నిర్వహించిన డాక్టర్ టామ్ చెరియన్. సిర్రోసిస్‌తో కాలేయం దెబ్బతిన్నది. కాలేయ మార్పిడి తప్ప గత్యంతరం లేదు.

కాలేయ దాత కూడా అందుబాటులో ఉన్నారు. కాని ట్రాన్స్‌ప్లాంటేషన్ చేసే పరిస్థితి లేదు. బతికినన్నాళ్లూ బతుకుతాడు.. అంతేగాని కాలేయ మార్పిడితో మరింత ప్రమాదాన్ని తెచ్చిపెట్టలేం అన్నారు డాక్టర్లు. ఏ అవయవానికైనా రక్తసరఫరా సక్రమంగా ఉంటే ఏ చికిత్స అయినా సులువుగా చేయవచ్చు. కాని రక్త సరఫరాలోనే సమస్య ఉంటే..? ఈ సమస్యనే సవాలుగా తీసుకున్నారు డాక్టర్లు. రక్తసరఫరాలో అంతరాయం ఉన్న కాలేయానికి మొట్టమొదటిసారిగా కావల్ ట్రాన్స్‌పొజిషన్(స్విచ్) విధానంలో ట్రాన్స్‌ప్లాంటేషన్ చేశారు కేర్ హాస్పిటల్‌కి చెందిన డాక్టర్ టామ్ చెరియన్.

కాళ్లూచేతుల పైన రోమాలు ఎక్కువగా ఉన్నాయని బాధపడుతున్నారా? దీనిలో కూడా పాజిటివ్ చూడండి. ఇలా ఎక్కువ రోమాలున్నవాళ్లలో తెలివితేటలు, ఐక్యు లెవల్స్ ఎక్కువగా ఉంటాయట. ఒక దశ వచ్చేవరకు మన శరీరంలోని ప్రతి భాగం పెరుగుతూ ఉంటుంది. యుక్తవయసు వచ్చిన తరువాత వీటి పెరుగుదల ఆగిపోతుంది. కాని చెవి, ముక్కు విషయంలో మాత్రం ఇలా జరగదు. వాటిలో పెరుగుదల ఆగిపోదు. వేళ్లపై ఉండే గుర్తులే (ఫింగర్ ప్రింట్స్) కాదు, నాలుక పైన కూడా టంగ్ ప్రింట్స్ కూడా ఒకరిని పోలి మరొకరికి ఉండవు. అదాదాపు 10 మిలియన్లకు పైగా వివిధ రకాలైన రంగుల షేడ్స్‌ను మన కళ్లు గుర్తించగలుగుతాయి. వాటిలో తేడా కనిపెట్టగలుగుతాయి. మన కన్ను డిజిటల్ కెమెరా లాంటిదే. ఇది 576 మెగా పిక్సెల్ సామర్థ్యాన్ని కలిగివుంది. మన శరీరంలో ఉండే బాక్టీరియా అన్నీ కలిపితే దాదాపు 4 పౌండ్ల బరువు తూగుతాయి. క్యాన్సర్లలో వందకు పైగా రకాలున్నాయి.

# చిత్రభాను

## త్రిష పంచ్!

బాక్సర్‌గా అవతారమెత్తింది త్రిష. ప్రత్యర్థులపై పంచ్‌ల వర్షం కురిపించడానికి సిద్ధమవుతున్నది. తనను ఓడించడం కలలో కూడా సాధ్యం కాదని ఛాలెంజ్ విసురుతున్నది. గత కొంతకాలంగా ప్రయోగాత్మక చిత్రాలపై ద ృష్టిసారిస్తున్న ఈ సొగసరి ప్రస్తుతం బాక్సింగ్‌లో శిక్షణ తీసుకుంటున్నది. శిక్షకుడితో కలిసి ప్రాక్టీస్ చేస్తున్న వీడియోను ట్విట్టర్ ద్వారా అభిమానులతో పంచుకున్నది. ప్రొఫెషనల్ బాక్సర్ తరహాలో త్రిష పంచ్‌లను సంధిస్తున్న ఈ వీడియోసామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ప్రస్తుతం బాక్సింగ్ తనకు ఓ వ్యసనంగా మారిపోయిందని, ఈ ఆటతో ప్రేమలో పడిపోయానని చెబుతున్నది. తనను ఓడించాలని కలగన్నా అది మీకు సాధ్యం కాదు. వెంటనే మెల్కొని నన్ను క్షమాపణలు కోరుకోండి అంటూ ట్వీట్ చేసింది. ప్రస్తుతం తమిళ, మలయాళ భాషల్లో అరడజనుకుపైగా చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉన్నది త్రిష.



## బాలకృష్ణపై శ్రీయా సెన్సేషనల్ కామెంట్స్..



దక్షిణాది చిత్ర పరిశ్రమలో ఒక వెలుగు వెలిగిన శ్రీయా సరన్ కొన్నాళ్లుగా ఆ మెరుపులు మెరిపించడం లేదు. కానీ తాజాగా ఆమె అంగీకరించిన సినిమాలు చూస్తే ఆమె కెరీర్ మళ్లీ గాడిన పడినట్టు కనిపిస్తున్నది. నటసింహ బాలకృష్ణ 100వ చిత్రంగా ప్రతిషా‘త్మకంగా రూపుదిద్దుకొన్న గౌతమిపుత్ర శాతకరి? చిత్రంలో ఆమె వశిషి‘దేవిగా తన నటనతో ప్రేక్షకులను మెప్పించింది. ఆ చిత్రం తర్వాత మళ్లీ బాలకృష్ణ చిత్రంలో నటించే అవకాశాన్ని చేజిక్కించుకొన్నది. శ్రీయా సరన్ నటిస్తున్న తాజా చిత్రం పైసా వసూల్. ఈ చిత్రం ద్వారా మరోసారి బాలకృష్ణ సరసన నటిస్తున్నది. పైసా వసూల్ చిత్రంలో జర్నలిస్టుగా శ్రీయ కనిపించనున్నది. జర్నలిస్టుగా పనిచేసే తాను బాలక ృష?ను ఎలా కలిశానన్నదే తన పాత్ర నేపథ్యం అని ఇటీవల శ్రీయా సరన్ ఓ ఇంటర్వ్యూలో వెల్లడించింది. ఈ చిత్రానికి పూరీ జగన్నాథ్ దర్శకత్వం వహిస్తున్న సంగతి తెలిసిందే. వంద చిత్రాల్లో నటించి ప్రేక్షకుల హ ృదయాల్లో చోటు సంపాదించకొన్న బాలక బాలకృష్ణతో నటించడం నా అద ృష్టం. అంతేగానీ నేను నటించడం వల్ల ఆయన సినిమాలు బాగా ఆడుతున్నాయి అనే ప్రశ్న సరికాదు. నేను ఈ ఏ హీరోకు కూడా లక్కీ హీరోయిన్ కాదు. బాలక ృష?నే నాకు లక్కీ హీరో. ఆయనతో నటించిన సినిమాలన్నీ ఘన విజయం సాధించాయి అని శ్రీయ సరన్ పేర్కొన్నది. బాలకృష్ణతో నటించడం ఇది మూడోసారి. ఆయనతో నటించిన అన్ని చిత్రాలు ఘన విజయం సాధించాయి అని ఆమె అన్నారు. పూరీ జగన్నాథ్ గురించి శ్రీయ సరన్ మాట్లాడుతూ.. దక్షిణాదిలో మంచి దర్శకుల్లో పూరీ ఒకరు. చాలా మంది కొత్త దర్శకులతో పనిచేసిన అనుభవం ఉంది. ప్రతి ఒక్కరు నన్ను తెరమీద అదుతేంగా చూపించారు. పైసా వసూల్ చిత్రంలో తన పాత్రను పూరీ జగన్నాథ్ అద్భుతంగా డిజైన్ చేశారు అని చెప్పారు.

## సితార మెచ్చిన పాట



మహేష్‌బాబు కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం స్పైడర్‌లోని బూమ్ బూమ్ అనే పాటను ఇటీవలే విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ గీతం సంగీతప్రియుల్ని విశేషంగా ఆకట్టుకుంటున్నది. మహేష్‌బాబు గారాలతనయ సితారకు కూడా ఈ పాట బాగా నచ్చిందట. పదేపదే ఈ పాటను వింటూ ఎంజాయ్ చేస్తున్నదట. ఈ విషయాన్ని మహేష్‌బాబు ట్విట్టర్ ద్వారా అభిమానులతో పంచుకున్నారు. కారులో ప్రయాణిస్తున్న సితార బూమ్ బూమ్ పాటను వింటూ, హమ్ చేస్తూ సంబరపడిపోతున్న వీడియోను మహేష్‌బాబు ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు. సితార ఈ పాటను రిపీట్ మోడ్‌లో పెట్టుకొని పదేపదే వింటున్నది. తనకు నచ్చిన కొత్త పాట ఇది అంటూ మహేష్‌బాబు వ్యాఖ్యానించారు. తెలుగు, తమిళ భాషల్లో మురుగదాస్ దర్శకత్వంలో ఈ చిత్రం తెరకెక్కుతున్నది. ఒక పాట మినహా చిత్రీకరణ పూర్తయింది. సెప్టెంబర్ 27న విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

## వావ్..! రమ్యకృష్ణ ఇప్పటికీ

రమ్యకృష్ణ ఒకప్పటి టాలీవుడ్ గ్లామర్ క్వీన్, అప్పట్లో రమ్యకృష్ణని కేవలం గ్లామర్ గానే కాదు ఆహ్వానం లాంటి సినిమాల్లో కూడా రమ్య అందానికి దాసోహం అన్నారు. బాహుబాలిలో శివగామి పాత్రతో యవత్ భారతదేశ సినిమా ప్రేక్షకులని ఆకట్టుకోని లేటు వయస్సులో ఎందరో అభిమానులని కూడగట్టుకుంది రమ్యకృష్ణ. ఆ ఒక్క సినిమా చాలు రమ్యకృష్ణకి ఇంకా అన్ని ఇండస్ట్రీలలో తిరుగులేకుండా చెయ్యడానికి. దక్షిణాదిన క్యారక్టర్ అర్టిస్టుల్లో అత్యంత రెమ్యూనరేషన్ తీసుకుంటున్న నటిగా కూడా రమ్యకృష్ణ ఇప్పుడు నిలిచింది అంటే దీనంటటికి కారణం ఒక్క బాహుబలి సినిమానే అని చెప్పుకోవచ్చు.. హీరోయిన్ గా ఒక వెలుగుతున్న సమయంలో ‘నరసింహ’ వంటి సినిమాలో రజనీకాంత్ లాంటి హీరోకి దీటైనా పాత్రలో నటించి అప్పట్లోనే అందరి నుండి మంచి ప్రశంసులు అందుకుంది రమ్య. కేవలం నటన విషయంలోనే కాదు.. గ్లామర్ విషయంలో కూడా రమ్యకృష్ణ వన్నె తగ్గలేదు.ఇక లేటెస్ట్ గా ఆమె జే ఎఫ్ డబ్ల్యూ మేగజైన్ ముఖచిత్రంపై మెరిసింది. ఈ మేగజైన్ ముఖచిత్రం పై ఆమె లుక్ ను .. ఇచ్చిన స్టిల్ చూసిన వాళ్లంతా ‘వావ్’ అంటున్నారు. 46 సంవత్సరాల వయసులోను ఆమె ఇంత గ్లామరస్ గా కనిపిస్తూ ఉండటం రియల్లీ గ్రేట్ అంటున్నారు. చిరంజీవి .. బాలకృష్ణ .. వెంకటేశ్ వంటి సీనియర్ కథానాయకుల సరసన కూడా మళ్లీ కథానాయికగా అలరించేంత గ్లామర్ ఆమె సొంతమని చెప్పుకుంటున్నారు. అలా జరిగే అవకాశం కూడా లేకపోలేదు. తల్లి పాత్రలు చేస్తున్నా, నయా హీరోయిన్లకు పోటీ ఇచ్చేంత గ్లామరస్‌గా కనిపిస్తోంది రమ్య. ఇటీవలే నాగార్జున సరసన ఒక హీరోయిన్‌గా నటించి.. ఆ సినిమాలోని అరడజను మంది అమ్మాయిలకు పోటీని ఇచ్చిన రమ్య.. సీనియర్ హీరోల సరసన చక్కగా అమరేలా ఉంది ఈ లుక్‌లో.



## ఆరేళ్లు టార్చర్ అనుభవించా

సాధారణ మహిళలు మాత్రమే కాదు... సెలబ్రిటీలు సైతం గ ృహ హింస, వేధింపులకు గురవుతున్న సంఘటనలు అనేకం. ఈ పరిణామాలు చివరకు విడాకులకు దారి తీస్తున్నాయి. ఇలాంటివి ఎదుర్కొన్న సెలబ్రిటీల్లో ప్రముఖ తెలుగు సింగర్ కౌసల్య ఒకరు. కౌసల్య తన చిన్న నాటి స్నేహితుడిని ఇష్టపడి పెళ్లాడింది. పెళ్లయిన తర్వాత అతడి నుండి వేధింపులు ఎదురవ్వడంతో పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చినా అతడి తీరు మారలేదు. అలాంటి వ్యక్తితో జీవించడం కంటే విడిపోవడమే బెటర్ అని నిర?యించుని తెగదెంపులు చేసుకున్నారు. ప్రస్తుతం కౌసల్య తన కుమారుడితో ఉంటోంది. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఆమె తన విడాకుల అంశంపై స్పందించారు. నేను ఏదో క్షణికావేశంలో విడాకులు తీసుకోలేదు. వైవాహిక జీవితంలో దాదాపు ఆరేళ్లు టార్చర్ అనుభవించాను. అంతకు మించి భరించడం నా వల్ల కాలేదు. అందుకే విడాకులు తీసుకోవాల్సి వచ్చిందని కౌసల్య తెలిపారు.పెళ్లైన పదహారు రోజులకే భర్త కొట్టాడు. అందరి ముందు తీవ్రమైన అసభ్య పదజాలం ఉపయోగించి తిట్టేవాడు. అతడి ప్రవర్తన చూసి అతడి పేరెంట్స్ కూడా షాకయ్యేవారు. వారి ఫ్యామిలీలో ఎవరికీ లేని తిట్టడం, కొట్టడం లాంటి అలవాట్లు ఇతడికి ఎలా వచ్చాయని బాధపడే వారు అని కౌసల్య తెలిపారు. అతడితో కలిసి ఉన్నంత సేపు స్వేఛ ఉండేది కాదు. నా ఇష్టాలతో సంబంధం లేకుండా అతడి ప్రవర్తన ఉండేది. నేను చీరకట్టుకునే విషయంలో, చివరకు బొట్టు పెట్టుకునే విషయంలో కూడా అలా, ఇలా అని చెప్పేవాడు. అయినా సరే సర్దుకుపోయాను. ఆ వేధింపుల మధ్య, హింస మధ్య ఉండటం నా వల్ల కాలేదు, అందుకే విడిపోవాల్సి వచ్చింది అని కౌసల్య తెలిపారు. నా విషయంలో ఎన్ని చేసినా భరించాను. కానీ కొడుకు విషయంలో కూడా బాధ్యతగా ఉండేవాడు కాదు. అలాంటి వ్యక్తితో ఉండటం కంటే విడిపోవడమే మంచిదని నిర?యించుకున్నట్లు కౌసల్య తెలిపారు. నాతో ఉన్నప్పటి నుండే వేరే మహిళతో సంబంధం పెట్టుకున్నాడు. వారికి సంబంధించిన వార్తలు కూడా



చాలా విన్నాను. ఓ సారి నా కొడుకు వారిని స్వయంగా చూశాడు. విడిపోవడానికి ఇంతకు మించిన కారణం అవసరం లేదని కౌసల్య తెలిపారు.

# డ్రగ్స్ కేసు దర్యాప్తులో మీ పరిధి ఎంత?

## వారంలోగా చెప్పాలని హైకోర్టు ఆదేశం

హైదరాబాద్: తెలుగు రాష్ట్రాలను కుదిపేసిన డ్రగ్స్ కేసుల్ని దర్యాప్తు చేసేందుకు ఆబ్కారీ శాఖకు అధికార పరిధి ఏమిటో వారంలోగా తెలపాలని హైకోర్టు ఆదేశించింది. డ్రగ్స్ వ్యవహారంలో కేంద్ర దర్యాప్తు సంస్థల పర్యవేక్షణలో జరపాలని కోరుతూ తెదేపా నేత రేవంత్‌రెడ్డి దాఖలుచేసిన వ్యాజ్యంపై ఉన్నత న్యాయ స్థానం మంగళవారం విచారించింది.

సిట్ దర్యాప్తు సంతృప్తికరంగా లేదని రేవంత్ తరఫు న్యాయవాది రచనారెడ్డి వాదించారు. ఎక్సైజ్‌శాఖకు మత్తుమందులు నియంత్రించే అధికారం ఉన్నా నిందితుల్ని ప్రాసిక్యూషన్ చేయలేదని, ఇతర రాష్ట్రాలు, దేశాల్లో విచారణ చేపట్టలేదని ఆమె వాదించారు.

ఎన్‌డీపీఎస్ చట్టం ప్రకారం ఎక్సైజ్ శాఖకు దర్యాప్తుచేసే అధికారం ఉందని ప్రభుత్వ న్యాయవాది శరత్ న్యాయస్థానానికి తెలిపారు. ఇరుపక్షాల వాదనలను విన్న న్యాయస్థానం ఏ చట్టం ప్రకారం, ఎంతవరకు విచారించే అధికారం సిట్‌కు ఉందో వారంలోగా తెలపాలని ఎక్సైజ్‌శాఖను ఆదేశించింది. తదుపరి విచారణను వచ్చే మంగళవారానికి వాయిదా వేసింది.

# నాకు, కోహ్లీకి మధ్య పోలికే లేదు



కరాచీ: భారత క్రికెట్ జట్టు సారథి విరాట్ కోహ్లీకి.. తనకు ఏమాత్రం పోలిక లేదని పాకిస్థాన్ యువ క్రికెటర్ బాబర్ అజామ్ పేర్కొన్నాడు. కోహ్లీ గొప్ప బ్యాట్స్‌మెన్ అని, తాను ఇంకా కెరీర్ ప్రారంభంలోనే ఉన్నానని అజామ్ తెలిపాడు.

కొద్ది రోజుల క్రితం అజామ్ ఓ క్రీడా ఛానెల్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. ప్రపంచంలోనే నంబర్ వన్ బ్యాట్స్‌మెన్‌గా ఎదగాలన్నది తన కోరిక అని తెలిపాడు. ఇదిలా ఉండగా ట్విటర్‌లో అజామ్ అభిమానులతో స్వయంగా ఛాటింగ్‌లో పాల్గొన్నాడు. ఈ సందర్భంగా ఓ అభిమాని మీ అభిమాన ఆటగాడు ఎవరని అడగ్గా ఏబీ డివిలియర్స్, విరాట్ కోహ్లీ, హషీమ్ ఆమ్లా అని తెలిపాడు. తాను క్రికెట్‌ను ఎంచుకునేందుకు తన అంకుల్ కారణమని.. ఆయనతో కలిసి వీధుల్లో క్రికెట్ ఆడిన సంఘటనలు ఇంకా గుర్తు ఉన్నాయని ఓ అభిమాని అడిగిన ప్రశ్నకు అజామ్ సమాధానం ఇచ్చాడు.

అనంతరం మరో అభిమాని అజామ్‌ను పాకిస్థాన్ కోహ్లీగా పిలవచ్చా అని అడగ్గా.. మా ఇద్దరి మధ్యా పోలికే లేదు. కోహ్లీ గొప్ప బ్యాట్స్‌మెన్. నేను ఇంకా కెరీర్ ప్రారంభంలోనే ఉన్నాను. పాకిస్థాన్ బాబర్ అజామ్‌గా పిలుపించుకోవడమే నాకు ఇష్టం అని అజామ్ పేర్కొన్నాడు. 22ఏళ్ల అజామ్ ఇప్పటివరకు పాక్ తరఫున 9 టెస్టులు, 31 వన్డేలు ఆడాడు.

# రవీంద్ర జడేజాకు నెంబర్ 1 ర్యాంక్...!



న్యూఢిల్లీ: ఐసీసీ టెస్ట్ ర్యాకింగ్స్‌లో టీమిండియా ఆల్ రౌండర్ రవీంద్ర జడేజా నెంబర్ వన్ స్థానానికి చేరుకున్నాడు. టెస్ట్ క్రికెట్ ఆల్‌రౌండర్ల విభాగంలో బంగ్లాదేశ్ ఆల్‌రౌండర్ షకిబ్ అల్ హసన్‌ను కిందికి నెట్టి అగ్రస్థానం సంపాదించాడు. జడేజా కెరీర్‌లో నెంబర్ వన్ ర్యాంకు దక్కడం ఇదే తొలిసారి కావడం విశేషం. కొలంబో వేదికగా భారత్, శ్రీలంక మధ్య జరిగిన టెస్ట్ మ్యాచ్‌లో జడేజా విశ్వరూపం చూపించిన సంగతి తెలిసిందే. 70 పరుగుల పదునైన బ్యాటింగ్‌తో అలరించిన జడేజా.. బౌలింగ్‌లోనూ సత్తా చాటి ఐదువికెట్లు పడగొట్టాడు. దీంతో రెండేళ్లలో ఐదోసారి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. గాలేలోనూ అద్భుత ప్రదర్శన కనబర్చిన ఈ సౌరాష్ట్ర స్టార్... ఇప్పటికే టెస్ట్ బౌలర్లలో నెంబర్ వన్ స్థానానికి చేరుకున్నాడు.

ఇక బ్యాటింగ్‌లోనూ 6 స్థానాలు మెరుగుపర్చుని 51వ ర్యాంకులోకి చేరుకున్నాడు.

# నోట్లు ఇచ్చేవారికి ఓట్లు వేయొద్దు : వెంకయ్య

నెల్లూరు: నోట్లు ఇచ్చేవారికి ఓట్లు వేయొద్దని విద్యార్థులకు ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన ఎం. వెంకయ్యనాయుడు ఉద్బోధించారు. నెల్లూరు జిల్లా వెంకటాచలంలో స్వర్ణ భారతి ట్రస్ట్ ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్న విద్యార్థులతో ఆయన మాట్లాడారు. విలువలతో కూడిన విద్య ఎంతో అవసరమన్నారు. క్రమశిక్షణతో విద్యనభ్యసించాలని సూచించారు. పాఠ్యాంశాల్లో నైతిక విలువలు చేర్చే అంశంపై ప్రధాని నరేంద్ర మోదీతో చర్చిస్తానని తెలిపారు. విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకుని సాధించేందుకు కృషి చేయాలని ప్రోత్సహించారు.

తన స్వగ్రామం చవలపాలెంలోనూ ఆయన పర్యటించారు.

కమ్యూనిటీ హాల్, రైల్వే స్టేషన్ ఏర్పాటు చేస్తామని ఆయన ఈ సందర్భంగా హామీయిచ్చారు. ఏ స్థాయిలో ఉన్నప్పటికీ పుట్టిన స్వగ్రామ అభివృద్ధిని మరువనని చెప్పారు.

# ఆనంద్‌కు తొలి విజయం



సెయింట్ లూయిస్ (అమెరికా): సింక్వీఫీల్డ్ కప్ అంతర్జాతీయ చెస్ టోర్నమెంట్‌లో భారత గ్రాండ్‌మాస్టర్ విశ్వనాథన్ ఆనంద్ తొలి విజయాన్ని నమోదు చేశాడు. ప్రపంచ ఐదో ర్యాంకర్ ఫాబియానో కరువానా (అమెరికా)తో జరిగిన ఐదో రౌండ్ గేమ్‌లో తెల్లపావులతో ఆడిన ఆనంద్ 29 ఎత్తుల్లో గెలుపొందాడు. తొలి నాలుగు గేమ్‌లను డ్రాగా ముగించుకున్న ఆనంద్ ఈ విజయంతో పాయింట్ల పట్టికలో సంయుక్తంగా రెండో స్థానానికి చేరుకున్నాడు. ప్రస్తుత ప్రపంచ చాంపియన్ మాగ్నస్ కార్ల్‌సన్ (నార్వే), ఆనంద్ ఖాతాలో మూడేసి పాయింట్లున్నాయి.

# మహిళా కానిస్టేబుళ్లకు హెల్మెట్ల బహూకరణ



వరంగల్‌క్రైం: రక్షా బంధన్ పర్వదినాన్ని పురస్కరించుకొని వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో రక్ష బంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

కమిషనరేట్ ట్రాఫిక్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న మహిళా కానిస్టేబుళ్లు పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబుకు రాఖీలు కట్టి మిఠాయిలు ఇచ్చారు. పోలీసు కమిషనర్ స్వయంగా హెల్మెట్లను కొనుగోలు చేసి మహిళా పోలీసు సిబ్బందికి అందజేశారు. విధులకు ద్విచక్ర వాహనాలపై వెళ్లే సమయంలో వీటిని ధరించాలని సూచించారు.

మహిళలకు రాఖీలు రక్షగా ఉంటే ప్రజలకు పోలీసులు రక్షణగా ఉండాలని పోలీసు కమిషనర్ సుధీర్‌బాబు సూచించారు. ఈ కార్యక్రమంలో హన్మకొండ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కిషోర్‌కుమార్ ట్రాఫిక్ పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచకప్ ఆడాలన్నది నా కల



కోచి: 2013 ఐపీఎల్ స్పాట్ ఫిక్సింగ్ కుంభకోణానికి సంబంధించి క్రికెటర్ శ్రీశాంత్‌పై జీవితకాల నిషేధాన్ని ఎత్తివేయాలని కేరళ హైకోర్టు బీసీసీఐని ఆదేశించిన సంగతి తెలిసిందే. కోర్టు తీర్పు సంతోషం వ్యక్తం చేసిన శ్రీశాంత్.. 2019 ప్రపంచకప్‌లో ఆడాలన్నది తన కల అని తెలిపాడు.

శ్రీశాంత్ ఓ ఛానెల్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. 2019 ప్రపంచకప్ ఆడాలన్నది నా కల. ఇది కష్టమని నాకు తెలుసు. కానీ ఏదో ఒక అద్భుతం జరిగిన నేను ప్రపంచకప్‌లో ఆడతా. అద్భుతాలు జరుగుతాయని నేను నమ్ముతున్నాను. జట్టులో ఇప్పటికే ఫాస్ట్ బౌలర్ల మధ్య పోటీ నెలకొంది. అయినప్పటికీ నేను ప్రయత్నిస్తా. నా ప్రతిభ ద్వారా నేను జట్టులో స్థానం దక్కించుకోగలనని భావిస్తున్నా అని తెలిపాడు. ప్రస్తుతం నా వయసు 34 ఏళ్లు. సచిన్, యూనిస్ ఖాన్, మిస్బా ఉల్ హాక్ 40ఏళ్లు దగ్గరి వరకు క్రికెట్ ఆడారు. వారిని స్ఫూర్తిగా తీసుకుంటా. సుమారు నాలుగేళ్ల పాటు క్రికెట్‌కి దూరంగా గడిపా. పూర్తి ఫిట్‌నెస్ సాధించి తెల్ల రంగు జెర్సీ ధరించి టెస్టు క్రికెట్ ఆడాలని ఉంది. నా మొదటి లక్ష్యం కేరళ జట్టు తరఫున రంజీ క్రికెట్‌లో ఆడటం అని శ్రీశాంత్ చెప్పాడు.


# రైళ్లలో రూ.38 లక్షల విలువైన గంజాయి పట్టివేత



రెజిమెంటల్‌బజార్: కోణార్క్, ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ రైళ్లలో ఒడిశా, విశాఖపట్నం నుంచి ముంబయికి గంజాయిని తరలిస్తున్న ఏడుగురిని అదుపులోకి తీసుకొన్నారు. వారి వద్ద నుంచి రూ.38 లక్షల విలువైన 220 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌చార్జీ రైల్వే ఎస్పీ రాజేంద్రప్రసాద్, ఇన్‌స్పెక్టర్ చంద్రయ్యలు వివరాలను వెల్లడించారు. ఒడిశాకు చెందిన జితేందర్ ప్రధాన్(25) స్థానికంగా గంజాయిని సాగుచేసే వ్యక్తుల వద్ద నుంచి కొనుగోలు చేసి కూలీలకు ఒక్కొక్కరికి రూ.5వేల చొప్పున ఇస్తూ రైళ్ల ద్వారా ముంబయికి రవాణా చేస్తున్నాడు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు వచ్చిన ఎక్స్‌ప్రెస్‌లలో జనరల్‌బోగీల్లో తనిఖీలు చేపట్టారు. సూట్‌కేసుల్లో గంజాయిని తీసుకెళ్తున్న ఒడిశాకు చెందిన పప్పుసాహు(23), బాబుల్లా నాయక్(31), పన్నాజైన్(46), జోగ్యబంటు లిమా(23)లతో పాటు జితేందర్‌ను ప్రధాన్‌లను అదుపులోకి తీసుకున్నారు. ఒడిశా కేంద్రపరా జిల్లాకు చెందిన జయంత్‌కుమార్ సాహు(51), ఆయన బంధువైన సావిత్రి సాహు(40)లో ముంబయిలో నివాసం ఉంటున్నారు. వారు ఒడిశా నుంచి గంజాయిని తీసుకెళ్లి ముంబయిలో కావాల్సిన వారికి అప్పగిస్తున్నారు. ఎల్‌టీటీ రైల్లో జనరల్ బోగిలో వారి నుంచి స్వాధీనం చేసుకున్నారు.




# కళాశాల సాధించేవరకు దీక్ష



కరీంనగర్: కరీంనగర్‌లో మెడికల్ కళాశాల ఏర్పాటు చేస్తానని ఇచ్చిన మాటా నిలుపుకోని కేసీఆర్‌కు ప్రజా వ్యతిరేకత మొదలైందని, ఆ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలని రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కోరారు. కరీంనగర్‌లో పొన్నం ప్రభాకర్ ఆమరణ దీక్ష శిబిరానికి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాల సాధించేవరకు దీక్ష కొనసాగుతుందన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో కరీంనగర్ జిల్లా కీలక పాత్ర పోషించిందని, అటువంటి జిల్లాపై కేసీఆర్‌కు ఎందుకు వ్యతిరేకత ఉందని ప్రశ్నించారు. లెదర్‌పార్కు, ఉద్యాన విశ్వవిద్యాలయం, నేదునూర్ ప్రాజెక్టు, సిరిసిల్ల టెక్స్‌టైల్ జోన్ ఇవన్నీ ఏమయ్యాయని, శాతవాహన విశ్వవిద్యాలయానికి మూడేళ్లుగా ఉపకులపతిని ఎందుకు నియమించలేదని ప్రశ్నించారు. ఇచ్చిన మాటాలు నిలుపుకోకుండా వాటి సాధన కోసం దీక్షలు చేస్తే అధికారుల చేత అనుమతులు ఇప్పించకుండా అడ్డుకునే విషయంపై జిల్లా ప్రజలు కేసీఆర్, కేటీఆర్‌లను నిలదీయాలన్నారు. తెరాస పాలనలో కరీంనగర్ జిల్లాకు అన్యాయం జరుగుతుందని, ఆ ప్రభుత్వాన్ని బొందపెట్టడం ఇక్కడి నుంచే ప్రారంభించాలన్నారు. శాసనమండలి పక్ష నాయకుడు షబ్బీర్‌అలీ మాట్లాడుతూ మెడికల్ కళాశాల విషయంలో సీఎం ఇచ్చిన హామీ గురించి మాట్లాడకుండా తెరాస నాయకులు కాంగ్రెస్‌ను విమర్శిస్తున్నారని మండిపడ్డారు. గత సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి తెలంగాణ కావాలా? వైద్య కళాశాల కావాలా? అని అడిగితే తెలంగాణ ఇచ్చి..వైద్య కళాశాల కూడా కావాలని చెప్పిన ఘనత పొన్నందేనన్నారు. కరీంనగర్‌ను లండన్, న్యూయార్క్ చేస్తామని మాయమాటాలు చెప్పి చేసిందేమి లేదన్నారు. శాసనసభపక్ష ఉప నాయకుడు జీవన్‌రెడ్డి మాట్లాడుతూ పొన్నం దీక్షను భగ్నం చేసే కుట్రలు జరుగుతున్నాయన్నారు. రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు అనిల్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ యువజన కాంగ్రెస్ ద్వారా రాజకీయాల్లోకి వచ్చిన కేసీఆర్ కాంగ్రెస్‌ను విమర్శించడం తప్ప మరేమీ లేదన్నారు. రాష్ట్ర కాంగ్రెస్ బీసీ సెల్ అధ్యక్షుడు చిత్తరంజన్‌దాస్ మాట్లాడుతూ పేదలకు అవసరమయ్యో వైద్య కళాశాల మంజూరు చేయకుండా, ఇసుక మాఫీయాను కేసీఆర్ ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. ఎమ్మెల్సీ ఆకుల లలిత మాట్లాడుతూ వాగ్ధానాలు మర్చిన ప్రభుత్వాన్ని, సీఎంను ప్రజలు వదిలి పెట్టరన్నారు.

VIJAYABHANU - Hyderabad

Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published from ANH Apartments, Block-A, Flat No. 508, Bazar Ghat, Red Hills, Hyderabad-500 004. and printed at **VIJAYABHANU PRESS**, D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003. R.N.I. No. 37754/81. Postal Regd. No. H-HD-1017/2006-08, Phone : 040 23370933, Fax : 040 66770933, Cell: 9701529570 ☆ e-mail: vijayabhanudaily@gmail.com